




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

PEN POWER TELUGU DAILY

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 231 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 27 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 231 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 27 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# అప్పటిలా కాదు... ఇప్పుడు ప్రతి గ్రామంలో మనం ఉన్నాం

- వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో జగన్ వ్యాఖ్యలు
- గతంలో తనను 16 నెలలు జైల్లో ఉంచారని వెల్లడి
- ప్రజలే అండగా నిలిచారని స్పష్టీకరణ
- ఇప్పుడు కూడా ప్రజలే తీవ్రంగా స్పందిస్తారని ఆశాభావం



**పెన్ పవర్ డెస్క్:**తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు నమోదు చేసినా, ఇబ్బందులకు గురి చేసినా తాను కానీ, పార్టీ శ్రేణులు కానీ భయపడే ప్రసక్తి లేదని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో తనను అన్యాయంగా 16 నెలల పాటు జైలులో ఉంచారని, పార్టీని నడపలేని పరిస్థితులు కల్పించినా ప్రజలు తనను, పార్టీని ఆదరించారని ఆయన గుర్తు చేసుకున్నారు. పీఏసీ సమావేశంలో జగన్ మాట్లాడుతూ, "నాడు నన్ను 16 నెలలు జైలులో పెట్టారు. పార్టీని నడిపే పరిస్థితి లేకుండా చేశారు. అయినా ప్రజలు ఆశీర్వదించారు. ఇప్పుడు ప్రతి గ్రామంలో మన పార్టీ ఉంది. వాళ్లు ఎన్ని కేసులు పెడితే ప్రజలు అంత తీవ్రంగా స్పందిస్తారు. నన్ను మరోసారి జైలుకు పంపినంత మాత్రాన ప్రజా వ్యతిరేకతను అణచివేయలేరు" అని అన్నారు.
గతంలో అక్రమాస్తుల కేసులో తనను అన్యాయంగా ఇరికించి జైలుకు పంపినా, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి అఖండ విజయాన్ని అందించారని జగన్ గుర్తుచేశారు. అదే విధంగా, ఇప్పుడు కూడా ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా,
ఎన్ని కేసులు బనాయించినా ప్రజల మద్దతు తమకే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు ఎదురైనా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని జగన్ ఈ సమావేశం ద్వారా సంకేతాలు పంపారు. ప్రభుత్వ చర్యల వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగి, అది అంతిమంగా తమ పార్టీకే లాభిస్తుందని అభిప్రాయపడ్డారు.

## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్.. 38 మంది నక్సలైట్లు మృతి!



**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ–చత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లా ధర్మ తాళ్లగుడెం పరిధిలోని కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో 38 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు సమాచారం. గతవారం రోజులుగా కర్రెగుట్టలే లక్ష్యంగా భద్రతా దళాలు ఆపరేషన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. సుమారు 5,500 మందితో డీఆర్‌జీ బస్తర్ ఫైటర్ కోబ్రా, సీఆర్‌పీఎఫ్, ఎస్‌టీఎఫ్ సైనికులు భారీ కూంబింగ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో ఈరోజు జరిగిన ఎదురు కాల్పుల్లో సుమారు 38 మంది నక్సలైట్లు మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య ఇంకా భారీగా పెరిగే అవకాశం

వివరాలు 2లో..

## ఏపీ లిక్కర్ స్కాం కేసు: సజ్జల శ్రీధర్ రెడ్డికి రిమాండ్

- ఏపీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో సిట్ దూకుడు
- మొన్న ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని సజ్జల శ్రీధర్ రెడ్డి అరెస్ట్
- నిన్న విజయవాడలో ఏసీబీ కోర్టులో హాజరు
- మే 6 వరకు జ్యుడిషియల్ రిమాండ్ విధించిన న్యాయమూర్తి



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయిన ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని సజ్జల శ్రీధర్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు మే 6వ తేదీ వరకు రిమాండ్ విధించింది. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అతడిని విజయవాడ జిల్లా జైలుకు తరలించనున్నారు. ఈ కేసులో ఆరో నిందితుడిగా (ఏ6) ఉన్న శ్రీధర్‌రెడ్డిని సిట్ అధికారులు నిన్న హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని విజయవాడకు తరలించి, నేడు ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి, శ్రీధర్‌రెడ్డికి మే 6 వరకు జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం కుంభకోణానికి సంబంధించి జరిగిన కుట్రలో శ్రీధర్ రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు సిట్ అధికారులు ఆరోపిస్తున్నారు.

వివరాలు 2లో..

## ఏం జరిగినా ఎదుర్కొంటాం: పహల్గాం ఉగ్రదాడిపై నోరు విప్పిన పాక్ ప్రధాని



**పెన్ పవర్ డెస్క్:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలోనే న్యూఢిల్లీ తీసుకున్న పలు నిర్ణయాలపై పొరుగుదేశంలోని పలువురు మంత్రులు అక్కసు వెళ్లగక్కారు. ఈ పరిణామాలపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా మౌనం వీడారు. పహల్గాం దాడి పై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని ప్రకటించారు. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొంటామంటూ వ్యాఖ్యానించారు. ఖైబర్

వివరాలు 2లో..

## జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం



- జీవీఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీధర్‌పై కూటమి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం విజయం
- 74 మంది సభ్యుల మద్దతుతో తీర్మానం నెగ్గినట్లు కార్పొరేటర్ల వెల్లడి
- శ్రీధర్ అవినీతి, అరాచకాలకు పాల్పడ్డారని కూటమి కార్పొరేటర్ల ఆరోపణ!
- నాలుగేళ్లుగా కనీస వసతులు (వీధి దీపాలు, నీళ్లు) కల్పించలేదని విమర్శ
- విశాఖను అభివృద్ధి పథంలో నడిపిస్తామని కూటమి సభ్యుల ధీమా

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లో అందాల పోటీలు.. నందిని గుప్తాకు స్వాగతం పలికిన పొన్నం ప్రభాకర్, స్మితా సబర్వాల్

- ఫెమినా మిస్ ఇండియా 2023 నందిని గుప్తా హైదరాబాద్‌కు రాక
- మిస్ వరల్డ్ 2025 పోటీల ప్రచారంలో భాగంగా పర్యటన
- బేగంపేట టూరిజం ప్లాజాలో మంత్రి పొన్నం, స్మితా సబర్వాల్ స్వాగతం
- మే 7 నుంచి 31 వరకు తెలంగాణలో 72వ మిస్ వరల్డ్ పోటీలు

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ రాష్ట్రం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 72వ మిస్ వరల్డ్ 2025 అందాల పోటీల ప్రచారంలో భాగంగా 'ఫెమినా మిస్ ఇండియా 2023' విజేత నందిని గుప్తా శనివారం హైదరాబాద్ నగరానికి విచ్చేశారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆమెకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్,

వివరాలు 2లో..



## స్టూడెంట్ వీసాపై వెళ్లి.. ఉగ్రవాదిగా మారి

- జమ్ము నుంచి పాకిస్తాన్ వెళ్లిన ఆదిల్ అహ్మద్ థోకర్
- పహెల్గాం ఉగ్రదాడిలో కీలక నిందితుడు
- స్వస్థలం అనంత్ నాగ్ జిల్లా గుర్రె గ్రామం
- 2024లో పూంచ్ సెక్టార్ నుంచి దొంగ చాటున టెర్రరిస్టుల టీమ్ తో రీ ఎంట్రీ



**పెన్ పవర్ డెస్క్:** పహెల్గాం ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఉగ్రదాడి నిందితుల్లో ఒకరైన ఆదిల్ అహ్మద్ థోకర్ 2018లో పాకిస్తాన్‌కు స్టూడెంట్ వీసాపై వెళ్లి ఆరు సంవత్సరాల తర్వాత ముగ్గురు నుండి నలుగురు ఉగ్రవాదులతో తిరిగి వచ్చాడని నిఘా వర్గాలు తెలిపాయి. జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని బిజ్‌బెహారాలోని గుర్రే గ్రామానికి చెందిన ఆదిల్ అహ్మద్ థోకర్, పహల్గామ్‌లోని బైసరన్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి వ్యూహం పన్నిన వారిలో ఒకడు. నిఘా అధికారుల ప్రకారం, థోకర్ భారత్

వివరాలు 2లో..

## ఏపీ లిక్కర్ స్కామ్ లోకల్ కాదు... ఇంటర్నేషనల్

- ఏపీ లిక్కర్ స్కామ్ రూ. 3200 కోట్లు కాదు.. రూ.10 వేల కోట్లకు పైనే అన్న ఎమ్మెల్యే
- అధికారిక సేల్ తగ్గించి అక్రమంగా అమ్మేసి వేల కోట్లు దోచేశారని ఆరోపణ
- అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



వివరాలు 2లో..

## పోప్ ఫ్రాన్సిస్‌కు అశ్రునివాళి.. అంత్యక్రియలకు హాజరైన భారత రాష్ట్రపతి ముర్ము, ప్రపంచ నేతలు

- పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో ఘనంగా నిర్వహణ
- 2.5 లక్షల మందికి పైగా సామాన్య ప్రజలు, 100కు పైగా దేశాల ప్రతినిధులు హాజరు
- భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేతృత్వంలో భారత బృందం నివాళి
- ప్రపంచ శాంతి కోసం పోప్ నిరంతరం పాటుపడ్డారన్న కార్డినల్ రే
- పోప్ కోరిక మేరకు వాటికన్ వెలుపల రోమ్‌లోని బేసిలికాలో ఖననం పూర్తి

**పెన్ పవర్ డెస్క్:**రోమన్ క్యాథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో శనివారం అత్యంత భక్తిశ్ర ద్ధలతో, వేలాది మంది అశ్రునయనాల మధ్య జరిగా యి. ఈ కార్యక్రమానికి సుమారు 2.5 లక్షల

వివరాలు 2లో..



## ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మరో పథకం ప్రారంభించాం



**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో మత్స్యకారుల సేవలో పథకాన్ని ప్రారంభించారు. దీనిపై సీఎం చంద్రబాబు ఎక్స్ లో స్పందించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీకి అనుగుణంగా మత్స్యకారులకు వేట విరామ కాలంలో అందించే ఆర్థిక సాయాన్ని పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గతంలో రూ.10 వేలుగా ఉన్న ఈ సహాయాన్ని రూ. 20 వేలకు పెంచామని, ఈ పథకం కింద నేడు 1,29,178 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ. 20 వేల చొప్పున మొత్తం రూ. 258.35 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. వేట నిషేధ సమయంలో ఆదాయం లేక మత్స్యకారులు పడే ఇబ్బందులను తాను ప్రత్యక్షంగా చూశానని, వారి కష్టాలను దృష్టిలో ఉంచుకొనే ఈ సాయాన్ని రెట్టింపు చేయాలని నిర్ణయించినట్లు చంద్రబాబు తెలిపారు. కష్టపడి పనిచేసే స్వభావం ఉన్నవారికి అండగా నిలవడం ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యమని స్పష్టం చేశారు. ఈ పథకం ప్రారంభం సందర్భంగా తాను శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలోని బుడగట్లపాలెం గ్రామాన్ని సందర్శించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

వివరాలు 2లో..

- మత్స్యకారుల సేవలో పథకం ప్రారంభించిన కూటమి ప్రభుత్వం
- శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెం గ్రామంలో చంద్రబాబు పర్యటన
- మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్న వైనం

## ఫిట్జీపై ఈడీ కొరడా... డైరెక్టర్ ఇంట్లో రూ. 4.89 కోట్ల విలువైన బంగారం సీజ్

- ఫిట్జీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్, కార్యాలయాల్లో ఈడీ విస్తృత సోదాలు
- రూ. 4.89 కోట్ల విలువైన నగలు, రూ. 10 లక్షల నగదు స్వాధీనం
- విద్యార్థుల నుంచి రూ. 206 కోట్లు వసూలు చేసి మోసం చేశారనే ఆరోపణలు
- నిధుల మళ్లింపు, 32 కేంద్రాల మూసివేతతో 14,411 మంది విద్యార్థులు ప్రభావితం
- పీఎంఎల్‌ఏ కింద కేసు నమోదు చేసి ఈడీ దర్యాప్తు ముమ్మరం




**పెన్ పవర్ డెస్క్:**దేశవ్యాప్తంగా పలు కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న ఫిట్జీ సంస్థలో భారీ ఆర్థిక మోసం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# "గేరు" మార్చనున్నారా?

**కేసీఆర్ చేయబోయే కీలక ప్రకటన అదేనటగా.. అంతటా ఉత్కంఠ**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏం మాట్లాడనున్నారు? బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలు వరంగల్ లో జరగనున్నాయి. ఈ సభకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు ఐదు లక్షలకు మందికి పైగా ప్రజలు హాజరయ్యే అవకాశముందని చెబుతున్నారు. చాలా రోజుల తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ సమావేశంలో కీలక ప్రసంగం చేయనున్నారు. అయితే ఆయన కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు చేయడం మామూలే. ఎందుకంటే రెండు పార్టీలను తెలంగాణ ప్రజలు తిరస్కరించాలని ఈ వేదికగా పిలుపు నివ్వనున్నారు. అదే సమయంలో పార్టీ పరంగా కీలక నిర్ణయం ప్రకటించే అవకాశముందని కూడా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నేటికీ కేసీఆర్ ను అభిమానించే వాళ్లు లక్షల్లో ఉన్నారు. ఆయన వల్లనే తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని భావించే వారు అనేక మంది ఉన్నారు.

**తెచ్చింది కేసీఆర్ అని...**

ఎవరు అవునన్నా కాదన్నా కేసీఆర్ అంటే రాజకీయాల్లో ఒక బ్రాండ్. ఆయన కేవలం తన మాటలతోనే తెలంగాణ రాష్ట్రాన్ని వచ్చేట్లు చేయడంలో ప్రధాన పాత్రపోషించారన్నది కూడా వాస్తవం. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినప్పటికీ తెచ్చింది ఎవరు అంటే? మాత్రం అందరి వేళ్లు గులాబీ బాస్ వైపు చూపతాయి. అందుకే కేసీఆర్ కు రాజకీయాల్లో ఒక ప్రత్యేకత ఉంది. 2001లో బీఆర్ఎస్ పార్టీని స్థాపించినా ఎన్నో కష్టాలు, ఎదురుదెబ్బలు తగిలినా కూడా చలించకుండా ముందుకు సాగారు. నేతలు పార్టీని వీడివెళ్లడంతో పాటు పదేళ్ల పాటు అధికారంలోకి రాలేకపోవడంతో ఉప ఎన్నికలకు వెళ్లి సత్తా చాటారు. 2014 నుంచి వరసగా పదేళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో అనేక సంక్షేమ పథకాలను అమలులోకి తెచ్చారు. అదే సమయంలో రాష్ట్రాన్ని విద్యుత్తు పరంగా ముందు వరసలో నిలిపారనడంలో ఎలాంటి సందేహం లేదు.

**పదేళ్ల పాలనలో...**

అయితే కేసీఆర్ పదేళ్ల పాలన కొందరికి ఇబ్బందిగా మారింది. కేవలం ఆయన ప్రగతి భవన్ కే పరిమితమవ్వడంతో పాటు కుటుంబ సభ్యుల జోక్యం, నియంతలలా వ్యవహరించడం, ఆందోళనలకు కూడా అవకాశమివ్వకపోవడం ఒకింత మైనస్ గా మారాయి. తెలంగాణ ప్రజలు నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వారికి కనీసం ఆందోళన తెలిపే స్వేచ్ఛ కూడా లేకుండా చేయడం జనాలను గులాబీ పార్టీ దూరమయింది. మరోవైపు తమ ఇంటిపార్టీగా భావించిన టీఆర్ఎస్ ను 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ గా మార్చడం కూడా ప్రజలు స్వాగతించలేకపోయారు. తెలంగాణ పార్టీ కాదని, వేరే ప్రయోజనాలను ఆశించి దీనినివిస్తరించారన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా నెలకొంది. దీంతో పాటు ఒక్కసారి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశమివ్వాలని కూడా ప్రజల్లో కలిగిన ఆలోచనతో బీఆర్ఎస్ ఓటమి పాలయింది.

**వరంగల్ వేదికగా...**

ఫలితంగా మొన్నటి ఎన్నికల్లో అధికారానికి దూరమయింది. అదే సమయంలో పార్లమెంటు ఎన్నికల సమయానికి కూడా అది పుంజుకోలేకపోయింది. ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. దీంతో ఇక ఈ వరంగల్ సభ నుంచి బీఆర్ఎస్ ను తిరిగి టీఆర్ఎస్ గా కేసీఆర్ మారుస్తారని, ప్రజలు కోరుకుంటున్నదదే కావడంతో పాటు తాను కూడా ఇక నేలవిడిచి సాము చేయకూడదని ఆయన నిర్ణయించుకున్నట్లు ప్రచారం పెద్దయెత్తున జరుగుతుంది. ప్రసంగాలతో నే కాదు.. ఇక చేతల్లోనూ చూపించాలని కేసీఆర్ డిసైడ్ అయ్యారని సమాచారం. అందుకే బీఆర్ఎస్ పార్టీని తిరిగి టీఆర్ఎస్ గా మార్చడం ఒక కీలక ప్రకటన ఈ సభ ద్వారా చేస్తారని తెలిసింది. మొత్తం మీద కేసీఆర్ రేపు మాట్లడే అవకాశముందని అంటున్నారు. అదే సమయంలో పార్టీలో కూడా సమూల ప్రక్షాళనతేవడంతో పాటు అన్ని వర్గాలకు స్థానం కల్పించేలా నిర్ణయం తీసుకోనున్నారు

## ఏం జరిగినా ఎదుర్కొంటాం: పహల్గాం ఉగ్రదాడిపై నోరు విప్పిన పాక్ ప్రధాని

- మొదటి పేజీ తరువాయి

పఖ్తుంఖ్వాలోని పాకిస్తాన్ మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న షెహబాజ్ షరీఫ్.. ఉద్రిక్తతల గురించి స్పందించారు. "పహల్గాంలో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కొంటోంది. ఆ ఘటనపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ దర్యాప్తులో పాల్గొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. శాంతికే మా ప్రాధాన్యం" అని షరీఫ్ తెలిపారు. ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ శాంతి వచనాలు వల్లె వేశారు.ఈసందర్భంగా ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేస్తామంటూ ఇటీవల భారత ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై షరీఫ్ పరోక్షంగా స్పందించారు. "మా దేశ భద్రత, సార్వభౌమత్వంపై ఎన్నటికీ రాజీపడబోం. ఎలాంటి ముప్పును ఎదుర్కోడానికైనా సంసిద్ధంగా ఉన్నాం" అని తెలిపారు. అనంతరం సింధూ జలాల ఒప్పందం నిలిపివేత అంశాన్ని ప్రస్తావిస్తూ.. "భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు. ఈ చర్యతో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని మేం కోరుకుంటున్నాం" అంటూ భారత్‌ను నిందించే ప్రయత్నం చేశారు.ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీని వెనక పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న లష్కరే తోయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫోర్స్' హస్తం ఉన్నట్లు భద్రతా బలగాలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాకిస్థాన్‌కు భారత్ గట్టి షాకిచ్చింది. సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాక్ పౌరులు తక్షణమే దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. అటు పాక్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది. భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది.

# పోప్ ఫ్రాన్సిస్‌కు అశ్రునివాళి.. అంత్యక్రియలకు హాజరైన భారత రాష్ట్రపతి ముర్ము, ప్రపంచ నేతలు

- మొదటి పేజీ తరువాయి

మందికి పైగా విశ్వాసులు, ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల ప్రతినిధులు, పలువురు దేశాధినేతలు, ప్రముఖులు హాజరై దివంగత పోప్‌కు తుది వీడ్కోలు పలికారు. భారత ప్రభుత్వం తరఫున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం ఈ అంత్యక్రియలకు హాజరైంది.

సెయింట్ పీటర్స్ బేసిలికా ప్రాంగణంలో జరిగిన ఈ ప్రత్యేక ప్రార్థనలకు కార్డినల్ జియోవన్నీ బటిస్టా రే నేతృత్వం వహించారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది కార్డినల్స్, ఆర్చ్‌బిషప్‌లు, బిషప్‌లు, మత గురువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్డినల్ రే మాట్లాడుతూ.. పోప్ ఫ్రాన్సిస్ ప్రజల మనిషి అని, అందరి పట్ల విశాల హృదయంతో వ్యవహరించారని కొనియాడారు. అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ చివరి క్షణం వరకు తన కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించారని గుర్తు చేసుకున్నారు. "గత ఈస్టర్ ఆదివారం నాడు కూడా తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పటికీ, సెయింట్ పీటర్స్ బేసిలికా బాల్కనీ నుంచి ఆయన మనందరినీ ఆశీర్వదించిన దృశ్యం మన మదిలో చిరకాలం నిలిచిపోతుంది" అని కార్డినల్ రే పేర్కొన్నారు. ప్రపంచంలో యుద్ధాల వల్ల జరుగుతున్న నష్టాన్ని చూసి పోప్ తీవ్రంగా కలత చెందారని, శాంతి స్థాపన కోసం, చర్చల ద్వారా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పిలుపునిచ్చారని ఆయన వివరించారు.

అంత్యక్రియల ప్రార్థనల అనంతరం, పోప్ ఫ్రాన్సిస్ పార్థివ దేహాన్ని ప్రత్యేక వాహనంలో రోమ్‌లోని 'బేసిలికా డి శాంటా మారియా మగ్గియోరే'కు తరలించారు. పోప్ ఫ్రాన్సిస్ తన వీలునామాలో పేర్కొన్న ప్రకారం, వాటికన్ గోడల వెలుపల ఈ బేసిలికాలో ఆయన భౌతికకాయాన్ని ఖననం చేశారు. శతాబ్ద కాలంలో వాటికన్ వెలుపల ఖననం చేయబడిన తొలి పోప్... పోప్ ఫ్రాన్సిస్ కావడం గమనార్హం. కార్డినల్ కెవిన్ ఫారెల్ ఆధ్వర్యంలో ఖనన ప్రక్రియ పూర్తయింది.

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జార్జ్ కురియన్, గోవా శాసనసభ డిప్యూటీ స్పీకర్ జోషువా డిసౌజా తదితరులు భారత ప్రతినిధి బృందంలో ఉన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలీ, బ్రిటన్ యువరాజు విలియం, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సహా పలువురు ప్రపంచ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా రోమ్ నగరం అంతటా 2000 మందికి పైగా పోలీసులను మోహరించారు.

# జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

**పెన్ పవర్ డెస్క్:**విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లో రాజకీయ పరిణామాలు వేగంగా మారాయి. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ) కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం విజయవంతమైంది. ఈ పరిణామంతో కూటమి సభ్యులు సంబరాలు చేసుకున్నారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్ అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడామని వారు వ్యాఖ్యానించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన అనంతరం కూటమి కార్పొరేటర్లు మీడియాతో మాట్లాడారు. గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో విశాఖ నగరంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. కనీసం వీధి దీపాలు వెలిగించలేని, తాగునీటి సమస్యలు పరిష్కరించలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. తమ అవిశ్వాస తీర్మానానికి 74 మంది సభ్యులు మద్దతు తెలిపారని, ఇది విశాఖ ప్రజల విజయమని అన్నారు. కొందరు వైసీపీ కార్పొరేటర్లు కూడా తమకు న్యాయం జరగలేదనే భావనతో, అభివృద్ధి కాంక్షించి అవిశ్వాసానికి మద్దతు పలికారన్నారు.

గత పాలనలో జరిగిన అవినీతికి, అభివృద్ధి రాహిత్యానికి ఈ అవిశ్వాస విజయంతో ముగింపు పలికామని కూటమి కార్పొరేటర్లు పేర్కొన్నారు. రాబోయే కొద్ది కాలంలోనే విశాఖ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలను కూటమి కైవసం చేసుకుంటుందని, ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని వారు తెలిపారు. ఈ విజయంతో విశాఖపట్నం తెలుగుదేశం పార్టీకి కంచుకోట అని మరోసారి నిరూపితమైం దని పలువురు కార్పొరేటర్లు అభిప్రాయపడ్డారు.

## ఫిట్జీపై ఈడీ కొరడా... డైరెక్టర్ ఇంట్లో రూ. 4.89 కోట్ల విలువైన బంగారం సీజ్

- మొదటి పేజీ తరువాయి

దిగింది. సంస్థ డైరెక్టర్ డి.కె. గోయల్ నివాసం, సీఈవో, సీఓఓ, సీఎఫ్ఓలతో పాటు పలు అధికారిక కార్యాలయాల్లో ఈడీ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లెక్కల్లో చూపని రూ. 4.89 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

ద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వసూలు చేసిన నిధులను యాజమాన్యం పక్కదారి పట్టించి, వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారని, అధ్యాపకులకు జీతాలు కూడా చెల్లించలేదని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు ఈడీ పేర్కొంది. ప్రస్తుతం నడుస్తున్న బ్యాచ్‌ల విద్యార్థుల నుంచి సుమారు రూ. 206 కోట్లు వసూలు చేశారని, అయితే వారికి చెప్పినట్లుగా విద్యా సేవలు అందించలేదని ఈడీ తెలిపింది. నిధులను దుర్వినియోగం చేయడం వల్లనే ఘజియాబాద్, లక్నో, నోయిడా, ఢిల్లీ, భోపాల్, ముంబై సహా దేశవ్యాప్తంగా 32 కోచింగ్ సెంటర్లను ఆకస్మికంగా మూసివేశారని, దీనివల్ల 14,411 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఈడీ వివరించింది.

నోయిడా, లక్నో, ఢిల్లీ, భోపాల్ సహా పలు పోలీస్ స్టేషన్లలో ఫిట్జీ యాజమాన్యంపై నమోదైన పలు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (%్రామీూా%) కింద కేసు నమోదు చేశారు. సోదాల్లో కీలకమైన పత్రాలు, డిజిటల్ ఆధారాలు లభించాయని, విద్యా సేవల ముసుగులో విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేసేందుకు పథకం ప్రకారం నిధులను పక్కదారి పట్టించినట్లు ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయని ఈడీ అధికారులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోంది.

# ఏపీ లిక్కర్ స్కామ్ లోకల్ కాదు... ఇంటర్నేషనల్

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ పాలనలో ఇంటర్నేషనల్ స్థాయిలో లిక్కర్ స్కామ్ జరిగిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ అన్నారు. రూ.1.30 లక్షల కోట్ల విలువైన నగదు లావాదేవీలు జరగడం దేశంలో ఎక్కడైనా చూశామా అని ఆయన ప్రశ్నించారు. అక్రమంగా దోచేయడం కోసమే మద్యం వ్యాపారంలో డిజిటల్ పేమెంట్లను జగన్ సర్కార్ అనుమతించలేదని ఆరోపించారు.ఓ వైపు ప్రధానమంత్రి మోదీ డిజిటల్ ఇండియా అంటుంటే జగన్ రెడ్డి మాత్రం క్యాష్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. ప్రస్తుతం ఈ కుంభకోణంపై విచారణ సాగిస్తున్న సిట్ మరింత లోతుగా వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ లిక్కర్ స్కామ్ రూ. 3200 కోట్లకు పరిమితం కాలేదని, రూ.10 వేల కోట్లకు పైనే అని అన్నారు. వేల కోట్ల అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగితే ఈడీ, సీబీఐ ఎందుకు రంగంలో దిగడం లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశ్నించారు. రూ.1.30 లక్షల కోట్ల క్యాష్ ట్రాన్సాక్షన్ జరుగుతుంటే గత ఐదేళ్లు ఈడీ, సీబీఐ ఈ కుంభకోణంపై ఎందుకు దృష్టి సారించలేదన్నారు. 1989లో రూ.60 కోట్ల విలువైన బోఫోర్స్ కుంభకోణం రాజీవ్ గాంధీ కొంపముంచిందని, 2014లో 2జీ స్కాం మన్మోహన్ సింగ్‌ను దెబ్బకొట్టిందని గుర్తు చేశారు. ఈ రెండు స్కాములు కాంగ్రెస్ పార్టీకి జాతీయ హోదా కోల్పోయే పరిస్థితి తెచ్చాయన్నారు. ఏపీలో జరిగిన లిక్కర్ స్కామ్ ఆషామాషీ కేసు కాదని తెలిపారు. కరోనా సమయంలో 2020 మార్చి 23న లాక్ డౌన్ విధించారు... మే 4న మద్యం దుకాణాలను రీ ఓపెనింగ్ చేశారు... ఆ 42 రోజులు మాత్రమే మద్యం విక్రయాలు ఆగాయని, కానీ లక్షల క్రేట్ల మద్యం విక్రయాలు తగ్గిపోయినట్లు లెక్క చూపించారని ఎమ్మెల్యే మండిపడ్డారు. జగన్ రెడ్డి పర్యవేక్షణలో నడిచిన కసిరెడ్డి అండ్ టీం ఎక్సైజ్ డిపార్టుమెంటులోని మద్యం డిపోలకు వెళ్లకుండా, స్కానింగ్ కాకుండా డిస్టిలరీల నుంచి నేరుగా దుకాణాలకు స్టాక్ తరలించి అక్రమంగా అమ్మేసుకున్నారని ఆరోపించారు.

మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుటుంబానికి చెందిన మెక్ డోవెల్ డిస్టిలరీ మూసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. అడిగినంత కమీషన్లు ఇవ్వలేదని నేషనల్, ఇంటర్నేషనల్ బ్రాండ్ల డిస్టిలరీలను అడ్డంగా మూసేశారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి 3 బాటిల్స్ తీసుకునే వెసులుబాటును కూడా తొక్కేశారని, తామిచ్చిన మద్యమే తాగాలని నియంతలా వ్యవహరించారని... జగన్ రెడ్డి అండ్ బ్యాచ్ కు డబ్బుపై ఉన్న వ్యామోహంతోనే ఇది జరిగిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు.

ఐఎస్ఐ గుర్తింపు పొందిన చెన్నైలోని ప్రముఖ ఎస్.జీ.ఎస్ లేబరేటరీ జగన్ ప్రభుత్వం విక్రయించిన సొంత మద్యం బ్రాండ్లపై సంచలన విషయాలను బయటపెట్టిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. వైసీపీ ప్రత్యేకంగా ప్రోత్సహించిన ఆంధ్రా గోల్డ్, 9సీ హార్సెస్, సిల్వర్ స్ట్రైప్ విస్కీలలో ప్రమాదకరమైన పైరోగలాల్, ఐసోఫులరిక్ యాసిడ్, డైఇథనాల్ టాలెట్ ఉన్నాయని తేల్చిందన్నారు. ఇవి తాగితే శరీరంలోని అవయవాలు దెబ్బతిని ప్రాణాలు కోల్పోతారని స్పష్టంగా నివేదికలు ఉన్నాయని తెలిపారు.

ఏపీలో కల్తీ మద్యం తాగి ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు వేల మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల మంది మంచాన పడ్డారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఓట్లతో సీఎంగా ఎన్నికైన వ్యక్తి వారి జేబుల్లోని డబ్బును లాక్కోవడమే గాక వారి ప్రాణాలను తీసేయడం దుర్మార్గమన్నారు.

కసిరెడ్డి అండ్ బ్యాచ్ మద్యం వ్యాపారాన్ని తమ చేతుల్లోకి తీసుకుందని, డిస్టలరీలను తమ గుప్పెట్లో పెట్టుకుని నాసిరకమైన మద్యం తయారు చేయించిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆరోపించారు. బ్రాండ్ ను బట్టి క్రేట్(48 బాటిల్స్) కు రూ.150 నుంచి రూ.600 చొప్పున కమీషన్ వసూలు చేశారని, అనఫిషియల్ సేల్ తో ఒక్కో క్రేట్ కు రూ.10 వేల వరకు ఆర్జించారని తెలిపారు. నడిబజారులో జరిగిన ఈ స్కామ్ ప్రత్యక్షంగా కనిపిస్తోంది.. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఈడీ, సీబీఐలను రంగంలోకి దించాలని ఆయన కోరారు. రూ.1000 లంచం తీసుకున్న ప్రభుత్వ ఉద్యోగిని ఏసీబీ అరెస్ట్ చేసి జైలుకు పంపుతుందని, వేల కోట్లు దోచేసి ప్రజల ప్రాణాలు తీసేసిన వారికి ఏ శిక్ష వేయాలని ప్రశ్నించారు.

క్యాష్ ట్రాన్సాక్షన్ కరెక్ట్ అని, ఈ మందు తాగినందున ఎవరూ చనిపోలేదు అని వైసీపీలోని పెద్ద నాయకులు, జగన్ రెడ్డి రైట్లు, లెఫ్టులు ఎవరైనా చెప్పగలరా అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి సవాల్ చేశారు. మధ్యలో లక్షల క్రేట్ల మద్యం సేల్ ఎందుకు తగ్గిపోయిందో సమాధానం చెబుతారా అని ప్రశ్నించారు. మద్యపాన నిషేధం అమలు చేస్తానని చెప్పి కల్తీ మద్యం పోసి ప్రాణాలు తీయడం క్షమించరాని నేరం అన్నారు.

## హైదరాబాద్‌లో అందాల పోటీలు.. నందిని గుప్తాకు స్వాగతం పలికిన పొన్నం ప్రభాకర్, స్మితా సబర్వాల్

- మొదటి పేజీ తరువాయి

నందిని గుప్తాను శాలువాతో సత్కరించి, మిస్ వరల్డ్ పోటీల విజయవంతానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులను, పర్యాటకులను మరింతగా ఆకర్షించే లక్ష్యంతో ఈ అంతర్జాతీయ స్థాయి అందాల పోటీలకు ఆతిథ్యం ఇస్తోంది. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించే ఈ పోటీలు మే 7వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీలలో సుమారు 140 దేశాలకు చెందిన అందగత్తెలు పాల్గొంటారని అంచనా. పోటీలలో భాగంగా వివిధ కార్యక్రమాలను తెలంగాణలోని చారిత్రక, పర్యాటక ప్రాముఖ్యత కలిగిన 10 ప్రాంతాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, ప్రారంభ, ముగింపు వేడుకలను హైదరాబాద్ మహానగరంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ భారీ కార్యక్రమం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటక ఆకర్షణలను ప్రపంచానికి పరిచయం చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది.

## ఏపీ లిక్కర్ స్కాం కేసు: సజ్జల శ్రీధర్ రెడ్డికి రిమాండ్

- మొదటి పేజీ తరువాయి

గత వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారం చేపట్టిన తర్వాత, కొత్త మద్యం విధానం పేరుతో నెలనెలా రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు అక్రమంగా ముడుపులు వసూలు చేసేందుకు కుట్ర జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ కుట్రలో భాగంగా జరిగిన కీలక సమావేశాల్లో శ్రీధర్‌రెడ్డి కూడా పాల్గొన్నారని సిట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సమావేశాల్లో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, నాటి ప్రభుత్వ ఐటీ సలహాదారు రాజ్ కెసిరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, అదే సంస్థ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్ వంటి వారు కూడా పాల్గొన్నట్లు కేసు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. ఈ ఆరోపణల నేపథ్యంలోనే సిట్ అధికారులు శ్రీధర్‌రెడ్డిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మరో పథకం ప్రారంభించాం

- మొదటి పేజీ తరువాయి

అక్కడ మత్స్యకార సోదరులతో నేరుగా మాట్లాడి వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నానని వివరించారు. ప్రభుత్వ పరంగా వారికి అన్ని విధాలా మేలు చేసే కార్యక్రమాలు చేపడతామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఆ కష్టజీవులతో గడిపిన సమయం, రాష్ట్ర ప్రజల కోసం మరింత కష్టపడి పనిచేయాలనే తన సంకల్పాన్ని మరింత దృఢపరిచిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్.. 38 మంది నక్సలైట్లు మృతి!

- మొదటి పేజీ తరువాయి

ఉందని సమాచారం. కానీ, మావోల మృతిపై ఇప్పటివరకు అధికారులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాగా, కర్రెగుట్టల కూంబింగ్ కొనసాగుతున్న వేళ శుక్రవారం మధ్యాహ్నం బస్తర్ మావోయిస్టుల ఇంచార్జ్ పేరిట లేఖ ఒకటి విడుదలైంది. ఆ లేఖలో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని, తాము శాంతి చర్చలకు సిద్ధమని కేంద్రంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు మావోలు విజ్ఞప్తి చేశారు.

## స్టూడెంట్ వీసాపై వెళ్లి.. ఉగ్రవాదిగా మారి

- మొదటి పేజీ తరువాయి

నుంచి పాకిస్తాన్ వెళ్లే ముందు సరిహద్దు అవతల పనిచేస్తున్న నిషేధిత ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్నాడు. స్టూడెంట్ వీసాపై పాకిస్తాన్‌లో చేరిన తర్వాత తన కుటుంబంతో సంబంధాలను తెంచుకున్నాడు. దాదాపు ఎనిమిది నెలల పాటు అతను ఎక్కడున్నాడనేది కుటుంబ సభ్యులకు తెలియలేదు. థోకర్ 2024 అక్టోబర్‌లో పూంచ్-రాజౌరి సెక్టార్ ద్వారా నియంత్రణ రేఖ దాటి ఇండియాలోకి వచ్చినట్టు నిఘా వర్గాలు నిర్ధారణకు వచ్చాయి. ఈ ప్రాంతంలోని భూభాగం నిటారుగా ఉన్న కొండలు, దట్టమైన అడవులు ఉంటాయి. ఇక్కడి నుంచి రావడం చాలా కష్టమని నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఈ సమయంలో థోకర్ తోపాటు నలుగురు వ్యక్తులు కూడా భారత భూభాగంలోకి వచ్చాయి. వారిలో ఒకరు పాకిస్తానీ జాతీయుడు, పహల్గామ్ ఉగ్రవాద దాడిలో మరొక ప్రధాన నిందితుడు హాషీమ్ ముసా, అతని అలియాస్ సులేమాన్ అని కూడా పిలుస్తారు. వీళ్లంతా భారత్ భూభాగంలోకి ప్రవేశించడంలో థోకర్ కీలక పాత్ర పోషించినట్టు నిఘా వర్గాలు అంచనాకు వచ్చాయి. జమ్మూలోకి వచ్చిన తర్వాత కొండలు, అటవీ ప్రాంతాల్లో నివాసం ఉన్నట్టు తెలుస్తోంది. అతనితోపాటు వచ్చిన పాకిస్తానీకి రహస్య స్థావరం ఏర్పర్చినట్టు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల నిర్మాణాలకు భూమి పూజ





**మడకశిర పెన్ పవర్ ఏప్రిల్ 26 :** మడకశిర పట్టణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ నూతన విగ్రహాలను నిర్మించేందుకు రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. దళిత, గిరిజన, బలహీన వర్గాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అంబేద్కర్ రాజ్యాంగం రూపకల్పన చేశారని అన్నారు. త్వరలోనే స్ఫూర్తిప్రదాతల విగ్రహాల నిర్మాణాలను పూర్తి చేసి, ప్రజలందరి మధ్య ఘనంగా ప్రతిష్టాపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, దళిత, బహుజన సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.




# రూ.9.22 కోట్ల అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్...





**కర్నూలు పెన్ పవర్ ఏప్రిల్ 26 :** కర్నూలు నగరాభివృద్ధే ప్రధాన అజెండగా నగరపాలక సర్వసభ్య సమావేశం జరిగింది. శనివారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని కౌన్సిల్ హాలులో మేయర్ బి.వై. రామయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, బొగ్గుల దస్తగిరి, కమిషనర్ యస్.రవీంద్ర బాబు బాబు సమావేశానికి హాజరయ్యారు. ముందుగా జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ముష్కరుల దాడిలో మృతి చెందిన 28 మందికి, ఇటీవల మృతి చెందిన 38వ వార్డు కార్పొరేటర్ గిప్సన్ ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు సభ సభ్యులంతా మౌనం పాటించారు. అనంతరం సర్వసభ్య సమావేశానికి తొలిసారి వచ్చిన ఎంపీ బస్తిపాటి నాగరాజుకి వేదికపై సత్కరించారు. అనంతరం మొత్తం 26 తీర్మానాలపై పాలకవర్గ సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. రూ.9.22 కోట్లతో రహదారులు, మురుగు కాలువలు, ఇతరత్రా అభివృద్ధి పచ్చజెండా ఊపారు. సమావేశం ప్రారంభించిన కాసేపటికి కాస్త గందరగోళం ఏర్పడడంతో, మేయర్ సభను పది నిమిషాల పాటు వాయిదా వేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్పందించే విధానంపై పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో తాగునీటి సమస్య, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్ల మరమ్మత్తులు, విద్యుత్ శాఖ కొమ్మలను నరికేసి అలాగే వదిలేయడం వంటి సమస్యలపై వాడివేడిగా చర్చ సాగింది. అలాగే కార్పొరేటర్లు వారి వార్డుల్లోని సమస్యలను లేవనెత్తారు. వాటి పరిష్కారం కోసం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను మినిట్స్ పెట్టి, వాటి పురోగతి స్థితిగతులను ఆయా సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. నగర పరిధిలో ఎక్కడికైనా నిమిషాల వ్యవధిలో వెళ్ళవచ్చని, అధికారులు సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో వెళ్లాలని, అధికారుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ప్రతిపాదనను రూపొందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఏదైనా పథకాల ద్వారా నిధులు వచ్చేందుకు అవకాశం ఉంటే, అధికారులు తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేల్, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం...

### - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్, ఏప్రిల్ 26 :** శ్రీశైల మహా క్షేత్రాన్ని, క్షేత్ర పరిసరాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నామని అందుకు అవసరమయ్యే డాక్యుమెంట్లు, సర్వే నంబర్ల వారీగా విస్తీర్ణ వివరాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి.రాజ కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శ్రీశైలం క్షేత్ర అభివృద్ధిపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో డిఆర్ఓ రాము నాయక్, డీఎఫ్ఓ సాయిబాబా, శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు, ఆత్మకూరు ఆర్డీఓ అరుణజ్యోతి, ఇరిగేషన్ ఎస్ఈ శివప్రసాద్ రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణమూర్తి, ఏపీటీడీసీ డివిఎం లక్ష్మీనారాయణ సంబధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ శ్రీశైల దివ్య క్షేత్రంతోపాటు చుట్టుపక్కల ఉన్న పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా, అహ్లాదకరంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని ఇందుకు అవసరమయ్యే డాక్యుమెంట్లు, సర్వే నంబర్ల వారీగా విస్తీర్ణ వివరాలు ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రీశైలానికి వచ్చే భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం మూడు రోజులపాటు శ్రీశైలం ప్రాంతంలోనే ఉండి పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రకృతి అందాలను దర్శించేందుకు వీలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. శ్రీశైలం వచ్చే భక్తుల సౌకర్యార్థం వసతి, క్యూలైన్స్, రవాణా, పార్కింగ్ ఇతర మౌలిక సదుపాయాలు తదితర 9 రకాల కాన్సెప్ట్ లతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే సున్నిపెంట ప్రాంతంలో గుర్తించిన 178 ఎకరాల రెవెన్యూ భూముల్లో 50 ఎకరాలు పర్యాటక శాఖకు కేటాయించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. గతంలో ఇరిగేషన్‌కు సంబంధించిన 1468.52 ఎకరాల ఇరిగేషన్ భూముల్లో 719 ఎకరాలు వివిధ శాఖలకు కేటాయించడం జరిగిందన్నారు.

## ఇటుకలు, ఇసుక మోసిన ఎమ్మెల్యే పరిటాల సునీత







**రాప్తాడు పెన్ పవర్ ఏప్రిల్ 26 :** నసనకోట దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాల ఏర్పాట్లలో పాల్గొన్న సునీత పంచాయతీ వాసులతో కలిసి శ్రమదానం.. వారితోనే కలిసి మెట్ల మీద భోజనం ఇది నా ఊరు..నా బాధ్యత అన్న పరిటాల సునీత నిత్యం రాజకీయలు, అధికారిక కార్యక్రమాలతో బిజీగా ఉండే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కూలీగా మారిపోయారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఇటుకలు, ఇసుక మోస్తూ శ్రమదానం చేశారు. ఇదంతా దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాల కోసం చేశారు ఆమె. రామగిరి మండలం నసనకోటలో వెలిసిన దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలను చాలా ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పెద్ద ఎత్తన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వీటిలో పంచాయతీ వాసులు స్వచ్ఛందంగా పాల్గొంటూ శ్రమదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే సునీత కూడా వారితో కలిసి శ్రమదానం చేశారు. సిమెంట్ ఇటుకలు మోస్తూ.. అలాగే ఇసుక గంపలు అందుకుంటూ పనులు చేశారు. మండుటెండలో కూడా ఆమె ఈ పనులు చేశారు. అనంతరం గ్రామస్థుల తోనే కలిసి గుడి మెట్ల వద్ద భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే నెల 14,15,16 వ తేదీలలో అమ్మవారి ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాల కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయన్నారు. పంచాయతీ వాసులంతా ఐక్యంగా నిర్వహించుకునే ఈ ఉత్సవాల కోసం శ్రమదానం చేయడం నా బాధ్యత అన్నారు. ఇది నా ఊరు అని.. నేను ఇక్కడ పనుల్లో పాలుపంచుకోవడం నా బాధ్యత అని ఎమ్మెల్యే సునీత అన్నారు.

## హైకోర్టు జడ్జ్ జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్‌కి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, పెన్ పవర్, ఏప్రిల్ 26 :** అనంతపురంలోని జిల్లా ఎస్పీ ఆఫీస్‌లో ఉన్న కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు జడ్జ్, అనంతపురం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి, వర్క్‌షాప్ యొక్క ఎక్స్-అఫీషియో చైర్‌పర్సన్ జడ్జ్ జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ న్యాయాధికారుల వర్క్ షాప్‌లో పాల్గొనేందుకోసం జిల్లా పర్యటనకు విచ్చేసిన. హైకోర్టు జడ్జ్ జస్టిస్ జి రామకృష్ణ ప్రసాద్‌ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించి ఘన స్వాగతం పలికారు.

## పాకిస్తానీయుల సార్క్ వీసాల రద్దుకు తక్షణ చర్యలు..!!

### - జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



**కడప, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** భారత ప్రభుత్వ హెూమ్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు.. ఈ నెల 27వ తేదీ నుండి భారతదేశంలో పాకిస్తానీయుల కోసం జారీ చేసిన సార్క్ వీసాలను రద్దు చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ అదితి సింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24.04.2025 తేదీన భారత హెూమ్ మంత్రిత్వ శాఖ కార్యాలయ మెమోరాండం సూచనలు మేరకు మరియు ఫారినర్స్ యాక్ట్, 1946లోని సెక్షన్ 3(1) లోని అధికారాలను ఖచ్చితంగా అమలు చేస్తూ.. పాకిస్థానీ పౌరులకు తక్షణమే వీసా సేవలను రద్దు చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆ మేరకు పాకిస్తానీ పౌరులకు భారత ప్రభుత్వం జారీ చేసిన మెడికల్ వీసాలు, దీర్ఘకాలిక వీసాలు, దౌత్య & అధికారిక వీసాలు మినహా.. ప్రస్తుతం ఉన్న అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 27 ఏప్రిల్ 2025 నుండి తక్షణమే రద్దు చేయబడతాయన్నారు. అలాగే.. మెడికల్ వీసాలు ఏప్రిల్ 29, 2025 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని, అందుకు సంబంధించి తిరిగి కొత్త వీసాలు కూడా జారీ చేయబడవని తెలిపారు. అలాగే.. ఈ ఆర్డర్ ప్రకారం భారత ప్రభుత్వం పాకిస్థానీ పౌరులకు జారీ చేయబడిన దీర్ఘకాలిక వీసాలు (ఎల్‌టివిలు) మరియు దౌత్య & అధికారిక వీసాలకు వర్తించదని తెలిపారు. పాకిస్తానీ పౌరులకు జారీ చేయబడిన వీసాల స్థితిని సూచించే వివరణాత్మక పట్టిక అనుబంధంలో ఇవ్వబడిందన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు ఇమ్మిగ్రేషన్ బ్యూరో వెబ్సైట్ ద్వారా ఈ ఆర్డరును విస్తృతంగా ప్రచారం చేయడం జరుగుతోందన్నారు. అంతే కాకుండా భారత ప్రభుత్వ ఆర్డర్ కు అనుగుణంగా జిల్లాలోని సంబందిత అధికారులు తగిన అవసరమైన చర్యలను తీసుకోవాలని జేసీ తెలిపారు.

## మత్స్యకార సముద్ర చేపల వేట నిషేధ భృతి పంపిణీ

### - సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ





**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తుంది అని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మత్స్యకారుల సేవలో.. సముద్ర చేపల వేట నిషేధ భృతి కార్యక్రమానికి గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుడగట్లపాలెం, శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభోత్సవ చేయనున్న కార్యక్రమాన్నికి వర్చువల్‌గా స్థానిక జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తుందని, అన్ని సహాయ సహకారాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సముద్ర చేపల వేట నిషేధిత భృతి పంపిణీ కార్యక్రమాన్నీ రాష్ట్ర ముఖ్యమంత్రి బుడగట్ల పాలెం, శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రారంభించనున్నారన్నారు. రొయ్యలు, చేప జాతులకు సంతోనోత్పత్తి సమయం కాబట్టి , ఏప్రిల్ 15 నుండి జూన్ 15 వరకు 61 రోజుల సముద్ర చేపల వేట నిషేధ కాలంలో ఎటువంటి జీవనోపాధి ఉండదు కాబట్టి వారి ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒకే విడదలో 20 వేల రూపాయలు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. మత్స్యకారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆక్వా జోన్‌తో సంబంధం లేకుండా ఆక్వా కల్చర్ చేసుకునే రైతులకు యూనిట్‌కి 1.50 పైసలతో విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. పులికాట్ ముఖద్వారం, రోడ్లు, పాఠశాల ఏర్పాటు వంటి ఆక్వా రైతులు సమస్యలను కలెక్టర్ కు విన్నవించగా సమస్యలకు పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. చిల్లకూరు, కోట తదితర మండలాలలో వెనుకబడిన గ్రామాలు ఉన్నాయని ప్రభుత్వ సహకారం మేరకు వారికి సహాయం, సమస్యల పరిష్కార దిశగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రానున్న వర్షాకాలంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. జిల్లాలో చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట మరియు తడ మండలంలోని 3947 మంది మత్స్యకారుల లబ్ధిదారులకు గాను ఏడు కోట్ల 89 లక్షల 40 వేల రూపాయలను లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని, మత్స్యకారుల వేట నిషేధ కాలంకు సంబంధించి వారి జీవనోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. అందరీ తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు అని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారులులైనా మత్స్యకారులకు రూ. 20 వేలు నిషేధ భృతి ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానని తెలిపారు. మత్స్యకారుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని వారికి ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. మత్స్యకారుల సేవలో అనే థీమ్ తో సముద్ర చేపల వేట నిషేధ భృతి పంపిణీ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లాలోని లబ్ధిదారుల మత్స్యకారులకు ఏడు కోట్ల 89 లక్షల రూ.40 వేల రూపాయల (7,89,40.000) మెగా చెక్కును ఎమ్మెల్యే తో కలిసి అందజేసిన జిల్లా కలెక్టర్. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్, మత్స్యకార సంఘాలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

### మే 11 నుండి 13వ తేదీ వరకు

## శ్రీ పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు

### - మే 6న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం







**తిరుపతి పెన్ పవర్ ఏప్రిల్ 26 :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మే 11 నుండి 13వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం మే 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. భక్తులు ఒక్కొక్కరు రూ.150/- చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. ఉత్సవాల్లో భాగంగా మే 12వ తేదీ ఉదయం 9.45 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. వసంతోత్సవాలు జరిగే మూడు రోజులు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

**మే 6న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం :** శ్రీ పద్మావతీ అమ్మవారి వార్షిక వసంతోవాలను పురస్కరించుకుని మే 6వ తేదీ ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేయనున్నారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఉదయం 9 గంటల నుండి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఉత్సవాల కారణంగా మే 6 మరియు మే 10 నుండి 13వ తేదీ వరకు కల్యాణోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

# పందిర్లపల్లె రామేశ్వర రెడ్డికి డాక్టరేట్



**మైదుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 26 :** మైదుకూరు డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న పి రామేశ్వర రెడ్డి కి ద్రవిడియన్ యూనివర్సిటీ, కుప్పం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈమేరకు విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలియ జేసింది. డా.బి.ఆర్. ప్రసాద్ రెడ్డి పర్య వేక్షనలో "సొసైయో ఎకనామిక్, కల్చరల్ డెవలప్మెంట్ ఇన్ సౌత్ ఇండియా అండర్ విజయనగర ఎంపైర్" అనే అంశంపై పరిశోధనకు పి.హెచ్.డి అవార్డు ప్రధానం చేశారు. డాక్టరేట్ అందుకున్న రామేశ్వర రెడ్డి గైడ్ డాక్టర్ బి.ఆర్. ప్రసాద్ రెడ్డి రీడర్, సిల్వర్ జూబ్లీ క్లస్టర్ విశ్వవిద్యాలయం, కర్నూల్, అసోసియేట్ ప్రొఫెసర్ డి. వెంకటేశ్వర రెడ్డి ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం, ఒంగోలు, SKSC డిగ్రీ కళాశాల, ప్రొద్దటూరు కరస్పాండెంట్ నంద్యాల కొండ రెడ్డి, ప్రొఫెసర్ సాంబశివ రెడ్డి యోగి వేమన యూనివర్సిటీలకు ధాన్యవాదాలు తెలియజేసారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## అర్చక పురోహితునికి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం



**కడప, పెన్ పవర్, ఏప్రిల్ 26 :** కడప నగరానికి చెందిన అర్చక పురోహితుడు శ్రీయపు రాజు మహానంది తీవ్ర అనారోగ్యం(పక్షవాతం) తో బాధ పడుతూ కడపలోని జయాదిత్య న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసు కున్న కడప జిల్లా విశ్వ హిందూ పరిషత్ అర్చక పురోహిత విభాగం, కడప జిల్లా అర్చక పురోహిత సమైక్య అధ్యక్షుడు విజయ్ బట్టర్ స్వామి వెంటనే తన బృందంతో కలిసి వెళ్ళి మహానంది స్వామి వారిని పరామర్శించారు. ఆయనకు, స్వామి వారి సతీమణికి మనోధైర్యం ఇచ్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కడప జిల్లా విశ్వహిందూ మందిర అర్చక పురోహిత సహ ప్రముఖ మరియు కడప జిల్లా అర్చక పురోహిత సమైక్య తరపున 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సాగర్ శర్మ స్వామి, ప్రభాకర్ శర్మ, సుధాకర్ శర్మ. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ.. జి.శివప్రసాద్ యాదవ్..



**అనంతపురం పెన్ పవర్ ఏప్రిల్ 26 :** హైకోర్టు ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్ యాదవ్ అనంతపురం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో విజయవాడలోని చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా పని చేయుచున్న యన్.రాజశేఖర్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా ఈరోజు ఉదయం పదవి బాధ్యతలు చేపట్టారు. రాబోయే కాలంలో బాధితులకు అవసరమైన మరిన్ని న్యాయ సేవలు, గౌరవనీయ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ గారి ఆదేశాల మేరకు అందిస్తామని తెలిపారు.

## అర్జీల పరిష్కారం సమాచారం కోసం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు పెన్ పవర్ ఏప్రిల్ 26 :** ఈనెల 28 వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకట నలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మూగ జీవాల పాలిట ప్రాణదాతలుగా పశువైద్యుల కీలకపాత్ర : కార్యనిర్వహణాధికారి

**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** పశు పోషకులకు మార్గదర్శకులుగా, మూగ జీవాల పాలిట ప్రాణదాతలుగా జీవ వైవిధ్యంలో కీలకపాత్ర పోషించే పశువైద్యుల సేవలను గురించి ఎంత చెప్పుకున్నా తక్కువేనని ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి డా. యం. శ్రీనివాసరావు తెలిపారు. శనివారం చిత్తూరు నందు గల పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుల వారి కార్యాలయములో ప్రపంచ పశువైద్య దినోత్సవం కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి హాజరు కాగా జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డా. మహమ్మద్ అబ్దుల్ ఆరిఫ్ మరియు సహాయ సంచాలకులు డా. సి చంద్రశేఖర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ.. మానవాళికి ప్రత్యకంగానే ఉపయోగపడే పశువుల ఆరోగ్యానికి పశువైద్యులు, పశువైద్య శాస్త్రవేత్తలు అందిస్తున్న బహుళ సేవలను మననం చేసుకునేందుకు ప్రతి ఏటా ఏప్రిల్ నెలలో చివరి శనివారాన్ని జరుపుతున్నారనన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశు సంవర్థక శాఖలో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన పలువురు విశ్రాంత ఉద్యోగులు మరియు అధికారులు హాజరై తాము సిబ్బందిగా ఉన్నప్పుడు విధి నిర్వహణలో తమ అనుభవాలను, తమ పాత జ్ఞాపకాలను ప్రస్తుత సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బందితో పాటు పదవీ విరమణ పొందిన విశ్రాంత చిత్తూరు సంయుక్త సంచాలకులు డా. యం. ప్రభాకర్, సి.డి.వో డా. వై. ఉపేంద్ర వర్మ, ఎ.డి.డి.యల్ డా. జి. పద్మావతి, పశుపోషకులు డా. మదుసూదన రెడ్డి, పలువురు పశుపోషకులు, బాలాజీ హేచరీస్ నిర్వాహకులు శ్రీ ప్రణీత్ కుమార్, నెక్ సంస్థ విశ్రాంత చైర్మన్ రమేష్ బాబు, నెక్ సంస్థ ప్రస్తుత చైర్మన్ బి. శ్రీనివాసులు నాయుడు, వెటర్నరీ ఫార్మా రంగానికి ప్రతినిధులుగా డా. రాంప్రసాద్, యంఎస్డీ అనిమల్ హెల్త్ తరపున, విర్బాక్ అనిమల్ హెల్త్ తరపున యం.తిరుపతి రెడ్డి, ఇన్టాస్ ఫెర్టీ లైఫ్ డివిజన్ తరపున యం. ఒబయ్య, డాక్టర్స్ పెట్ ఫార్మా లైఫ్ సైన్సెస్ నెల్లూరు వారి తరపున రెడ్డి బాబు, శ్రీ పద్మజ లెబోరేటరిస్ విజయవాడ వారి తరపున డా. కె. దినేష్ తదితరులు పాల్గంటున్నారు.

# పబ్లిక్ ప్రదేశాలలో చలివేంద్రాలు : జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్







**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, సమస్య ఉన్న చోట నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారు లను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు త్రాగునీరు, సాలిడ్ వేస్ట్ లిక్విడ్ మేనేజ్మెంట్‌పై మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉష్ణోగ్రతలు తీవ్రతగా ఉన్నాయని, ఎక్కడ కూడా నీటి సమస్య లేకుండా చూడాలని తెలిపారు. నీటి సమస్య ఉన్న ప్రదేశాలలో టాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు.. ఘన పదార్థాల సేకరణ తర్వాత శుద్ధి చేయడం ప్రధాన అంశమని అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా డంపింగ్ అనేది ఉండరాదని అన్నారు. ఈ వ్యర్థ పదార్థాల డంపింగ్ సంబంధించిన స్థల కేటాయింపు పై తాసిల్దారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు వ్యర్థాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. పబ్లిక్ ప్రదేశాలలో తప్పకుండా చలివేంద్రాలు ఉండేలా ఏర్పాట్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట వెంకటగిరి, శ్రీ కాళహస్తి, మున్సిపల్ కమిషనర్ లు వెంకటేశ్వర్లు, చిన్నయ్య, పజుల్లా, వెంకట్రామిరెడ్డి, గిరి కుమార్, ఈ ఈ పబ్లిక్ హెల్త్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సెక్షన్ ఫారమ్ 8 కంపెనీగా నమోదు : కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 25 :** రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సెక్షన్ ఫారమ్ 8 కంపెనీగా నమోదు చేసే ప్రక్రియపై శనివారం చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జేఎన్టీయూ విసి, సెంట్రల్ యూనివర్సిటీ వీసీ, కియ ఇండియా, జెఎస్ డబ్ల్యు, తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టెండర్ ప్రొక్యూర్మెంట్ ప్రక్రియను సమీక్షించి, అవసరమైన దశలను పరిశీ లించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవడం అనుకూలంగా నిర్ణయించబడింది. పబ్లిక్-ప్రైవేట్ పార్ట నర్షిప్ (PPP) మోడల్ నమోదు ప్రక్రియపై చర్చ జరిగింది. స్కిల్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్, MEPMA డిపార్ట్మెంట్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, SERP మరియు MSME సపోర్ట్ (GM-DIC) నుండి మోబిలైజేషన్ మద్దతు అవసరమవుతుందని గుర్తించబడింది. స్కిల్ డెవలప్మెంట్ బృందం మరియు టెక్నికల్ ఎక్స్పర్ట్స్, నాలెడ్జ్ ప్రొఫెషనల్స్తో జతకట్టి కార్పొరేట్ కనెక్షన్స్ను పెంచే ప్రణాళికపై చర్చ జరిగింది. అన్ని సంబంధిత విభాగాలను మెరుగైన సంబంధం మరియు సమన్వ యానికి WhatsApp గ్రూప్ ను సృష్టించడం నిర్ణయించబడింది. పరిశ్రమ లతో మెమొరాండం ఆఫ్ అసోసియేషన్ (MOA) మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ (AOA) టైప్ చేయడం ఈ సందర్భంగా నిర్ణయించబడింది. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటుచేసి వ్యూహాత్మక నిర్ణయాలను పరిశీలించాలనే ప్రతిపాదన చేయబడింది. సెక్షన్ ఫారమ్ 8 కంపెనీని ఏప్రిల్ 30లోపు నమోదు చేయాలని నిర్ణయించబడింది. సెంట్రల్ యూనివర్సిటీ నుంచి వారి సంస్థలో డ్రోన్ ట్రైనింగ్ ఇవ్వాలనేది ఒక అభ్యర్థన అందింది. మేనేజర్లు, HR బృందం, ట్రైనర్స్ తదితరుల నుండి స్టాఫ్ నియామకం అత్యవసరం అని గుర్తించబడింది. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ విసి, సెంట్రల్ యూనివర్సిటీ వీసీ, కియ ఇండియా ప్రతినిధి సోమశేఖర్ ఈడి, జెఎస్ డబ్ల్యు, కనకారావు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, ఓఎస్డి దీప్తి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# 28 తేదీన జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా






**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** 28 తేదీన ఉదయం 10 గంటలకి జిల్లా ఉపాధి కార్యాలయం, చిత్తూరు నందు ఉద్యోగ మేళా నిర్వహించ బడుతుందని,ప్రఖ్యాత MNCS కంపెనీలను ఈ కార్యక్రమంలోపాల్గొంటున్నాయని జిల్లా ఉపాధి అధికారి జి. పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగమేళాలో పాల్గొను 1. స్పాన్ సిక్స్ ఐటీ సొల్యూషన్స్ (SPANSIX IT SOLUTIONS), 2. సుప్రజిత్ ఇంజనీరింగ్ (SUPRAJITH ENGINEER ING), 3. టాటా ఎలక్ట్రానిక్స్ (TATA ELECTRONICS), 4. ట్రై జెన్ టేక్ ఐటి సొల్యూషన్స్ (TRI GEN TECH IT SOLUTIONS), 5. హొండా (HONDA), 6. ఫాక్స్ కాన్ (FOXCONN), 7. మార్కెట్ సాఫ్ట్ -1 (MARKET SOFT 1). డిప్లొమా, IT, ఇంటర్ మీడియట్, డిగ్రీ పూర్తి చేసి, మరియు వయసు 19 నుండి 35 సంవత్సరాల మధ్య ఉన్న ఆసక్తి గల అభ్యర్థులు తమ కరికులమ్, సర్టిఫికేట్లతో 28/04/25 (సోమవారం) తేదీన ఉదయం 10 గంటలకి జిల్లా ఉపాధి కార్యాలయం, ప్రభుత్వ ITI క్యాంపస్, కొంగారెడ్డిపల్లి, ఎస్టేట్, చిత్తూరు - 517001 లో నిర్వహించబడే, ఉద్యోగ మేళాకు హాజరుకావాలని, ఆసక్తిగల అభ్యర్థులు (పూరుషులు మరియు స్త్రీలు) ఉద్యోగ మేళకు పాల్గొనాలని, మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని ఆ ప్రకటనలో తెలిపారు.

# రైల్వే ఏసి వెయిటింగ్ హాల్ ప్రయాణికులు సద్వినియోగం






**కడప, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** కడప రైల్వే స్టేషన్ ఏసీ వెయిటింగ్ హాల్లో రైల్వే ప్రయాణికులు FREE PAID వెయిటింగ్ హాల్ ప్రయాణికులు కేవలము రెండు గంటలకు 24 రూపాయలు మాత్రమే చెల్లించి ఏసీ వెయిటింగ్ హాల్‌ను ఈ ఎండ తాకిడికి మరియు ఉపశమనం కొరకు సద్వినియోగం చేసుకోగలరని మొదటి ప్లాట్ ఫామ్ నందు జిఆర్పిఎఫ్ పక్కనే ఉన్న ఫ్రీ పెయిడ్ ఏసీ హాల్ను సద్వినియోగం చేసుకోగలరని రైల్వే కాంట్రాక్టర్ మధుసూదన రావు తెలియజేశారు.

# మే 20 దేశవ్యాప్త సమ్మె బుక్ లెట్స్ విడుదల : సిఐటియు




**ధర్మవరం పెన్ పవర్ ఏప్రిల్ 26 :** మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన బుక్లెట్స్‌ను సిఐటియు నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ జేవి రమణ, జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ ఆదిశే షూ, చేనేత కార్మిక సంఘం నాయకులు ఎస్ .హెచ్ భాష ,టి ఆ యుబ్ ఖాన్ మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడలుగా కుదించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక రకాల ప్రయత్నాలు జరుపుతున్నదని మండిపడ్డారు. కార్మిక చట్టాలను కుదించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్ని ప్రయత్నా లకు రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయన్నారు. గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వం కార్మిక చట్టాలకు సంబంధించిన బృందానికి మన రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలో ఆతిథ్యం కూడా ఇచ్చి, కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు తెలపడం జరిగినదని ,29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు కార్మిక కోడ్ లుగా అమలు చేస్తే కార్మికులకు కనీస వేతన చట్టం అమలయ్యే పరిస్థితి ఉండదని తెలిపారు.ఎనిమిది గంటల పని దినానికి స్వస్తి పలుకుతున్నారని, వేలాదిమంది కార్మికులు పోరాటాలు నిర్వహించి, ప్రాణాలర్పించి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.కావున కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ మే 20 తారీకున దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా కార్మికులకు పిలుపు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎల్ ఆదినారాయణ, ఎస్ హైదరాబాద్, తదితరులు పాల్గొన్నారు.

# పిఎస్‌యు జాతీయ మహాసభలు జయప్రదం చేయాలి

## పిఎస్‌యు లోగో ఆవిష్కరణ.. రాష్ట్ర కార్యదర్శి సుబ్బారాయుడు




**కడప, పెన్ పవర్, ఏప్రిల్ 26 :** ప్రగతిశీల విద్యార్థి సంఘం నాలుగో జాతీయ మహాసభల మే 9 నుంచి 11వ తేదీ వరకు కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో జరుగనున్నాయి. ఈ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని ఆర్ఎస్‌పి పార్టీ కార్యాలయంలో మహాసభల లోగోను ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన జాతీయవిద్యా విధానం ఏకపక్షంగా అమలు చేస్తుందనిఅన్నారు. దీనికరణంగా ప్రభుత్వ విద్యా సర్వనాశనం అయ్యింది అన్నారు. అలాగే 77 తెచ్చి పిజీ, ఎం బి ఏ, ఎం సి ఏ లాంటి ఉన్నత చదువులు చదవాలనే పేద మధ్యతరగతి విద్యార్థులకు స్కాలర్షిప్స్ రావడానికి రాకపోవడానికి కారణమైన జీవోరద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబరు 22 రద్దుచేసి డిగ్రీ ఫీజు నిర్ణయా విధానం పాత పద్ధతిలో కొనసాగించాలని పేర్కొన్నారు. అదేవిదంగా జీవో నంబర్ 36 రద్దు చేయాలని కోరారు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ సౌకర్యం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ అడ్మిషన్లు రద్దుచేసి ప్రత్యామ్నాయంగా కొత్త విధానం ప్రవేశపెట్టాలని తెలిపారు. డిగ్రీలో 70:30 మేనేజ్మెంట్ కోట రద్దుచేసి, పూర్తిస్థాయిలో రీయింబర్స్మెంట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అఫ్లియేషన్ ఫీజు అన్ని యూనివర్సిటీల పరిధిలో ఒకేలా ఉండేటట్లు ప్రభుత్వం చూడా లని కోరారు. డిగ్రీలో తెలుగు మీడియంలో ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. అఫ్లియేషన్ ఫీజులో జిఎస్టి తీసివేయాలని లేకపోతే అదనంగా ఫీజులు భారం విద్యార్థులపై పడుతుందని పేర్కొన్నారు. అలాగే పరీక్షా విధానంలో నూతన వరవడితో పటిష్టమైన వ్యవస్థను తీసుకురావాలని కోరారు. గతంలో లాగా డి ఎస్ సి నోటిఫికేషన్లో బీపీఈడీ ఎంపీడీ చేసిన విద్యార్థులకు 30 శాతం వెయిటేజ్ కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ ప్రణాళిక రూపొందించుకోవడం కోసం జరుగుతున్న జాతీయ మహాసభలలో దేశవ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు పాల్గొంటారు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు గోపి, నరసింహ, నాగేంద్ర, సురేంద్ర, శివ ఓబుల కృష్ణ, హరి, శివ, సురేంద్ర, రత్నపాల్, శివ కుమార్ పాల్గొన్నారు.

# ఎస్పీఎఫ్ సిబ్బందికి సూచనలు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 26 :** శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో ఎస్పీఎఫ్ సిబ్బందికి వన్ టౌన్ సీఐ గోపి పలు సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాల్లో హై అలర్ట్ జారీ చేశారని చెప్పారు. శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో భద్రతను కట్టుదిట్టం చేశా మన్నారు. ఎస్పీఎఫ్, సెక్యూరిటీలు భక్తుల లగేజీని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న తిరుపతి జిల్లా కాంగ్రెస్ నాయకులు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 26 :** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున కర్గే ఆదేశాల మేరకు పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి, అధ్యక్షతన విజయ వాడ ఎ-1 కన్వెన్షన్ సెంటర్ నందు పిసిసి కార్యవర్గం మరియు జిల్లా అధ్యక్షులకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కాంగ్రెస్ పార్టీ యొక్క పునర్నిర్మాణం లో భాగంగా కాంగ్రెస్ పార్టీని ప్రజలకు ఏ విధంగా చేరువ చేయాలి అని మరియు నేడు భారతదేశంలో ప్రతిరోజు భారత రాజ్యాంగం కూని జరుగుతుందని నేడు అమిత్ షా రాజ్యాంగం నడుస్తోందని ప్రజలకు రాజ్యాంగం యొక్క ఆవశ్యకతను తెలియజేసే భారత రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమం కార్యక్రమం పై దిశా నిర్దేశం చేశారు .ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహులు, నెల్లూరు జిల్లా ఇన్చార్జి గోపాల్ రెడ్డి, తిరుపతి సిటీ అధ్యక్షులు చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జగదీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం లాడ్జీలపై పోలీస్ తనిఖీలు...




**ధర్మవరం పెన్ పవర్ ఏప్రిల్ 26 :** భారత్‌పై ఉగ్ర దాడి నేపథ్యంలో జిల్లా ఎస్ పి వి. రత్న ఆదేశాల మేరకు ధర్మవరం డిఎస్‌పి హేమంత్ కుమార్ ఆధ్వ ర్యంలో పట్టణంలో వున్న అన్ని లాడ్జిలలో ధర్మవరం టూ టౌన్ సీఐ రెడ్డెప్ప, మరియూ వన్ టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తమ సిబ్బంది తో ఆకస్మిక తనిఖీ లు శనివారం సాయంత్రం నిర్వహిం చారు. ఈ దాడులలో లాడ్జి లకు వచ్చే వారి వివరాలు సక్రమంగా వారి రిజిస్టర్లలో నమోదు చేయడం లేదని టూ టౌన్ సీఐ రెడ్డెప్ప తమ తనిఖీలలో వెల్లడై యిందని తెలిపారు. ఆధార్ ఫోన్ పూర్తి వివరాలు లాడ్జ లకు వచ్చే వారి వివరాలు తప్పని సరిగా లాడ్జ్ రిజిస్టర్ లలో సేకరించాలని ధర్మవరం పోలీస్ శాఖ వారు పేర్కొన్నారు. ముందు జాగ్రత్త చర్యగా ఈ తనిఖీలు నిర్వహించడం జరిగిందని ధర్మవరం పోలీస్ శాఖ వారు తెలిపారు. అదేవిధంగా వాహనాలు తనిఖీ మమ్మరం చేస్తామన్నారు.

## వితంతు పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 26 :** మే నెల ఒకటో తారీకు నుంచి వీరికి పెన్షన్ అందజేత,అర్హత:2023 ,డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య పెన్షన్లు కోల్పోయిన వారు అర్హులు,

**గమనిక :** అర్హురాలైన మహిళలు భర్త మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు వారి యొక్క ఆధార్ కార్డు తదితర వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించాలి. ఏప్రిల్ 25 శుక్రవారం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ వివరాలు స్వీకరించనున్నారు. అర్హులు ఈ నెల 30లోపు ఈ వివరాలు సమర్పిస్తే, జూన్ నుండి పింఛను సొమ్ము అందుతుంది. కావున ఈ అవకాశాన్ని అర్హులందరూ వినియోగించుకోవాల్సిందిగా కోరుతున్నాను.

## "అనంత ఆణిముత్యాలు"కి రెవిన్యూ, విద్యుత్ శాఖ సహాయం...

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి





**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** అనంత ఆణిముత్యాలు" ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ కింద ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు ఏపీ ఎస్పీడీసీఎల్ మరియు రెవెన్యూ శాఖ లోని ఉద్యోగులు రూ. 75000 ఆర్థిక సాయం అందించడం జరిగిందనిజిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్లో "అనంత ఆణిముత్యాలు" ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్మెంట్ సొసైటీకి జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు సహాయం కోసం టి.నారాయణస్వామి, జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని భూ సంరక్షణ విభాగపు తాసిల్దార్ రూ.50000/- మరియు విఎం రవిశంకర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విద్యుత్ శాఖ, అనంతపురం వారు రూ.25000 వేల రూపాయల చెక్కులను జిల్లా కలెక్టర్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఒక కుటుంబం.. ఒక పారిశ్రామిక వేత్త లక్ష్యాలను సాధించాలి : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** ఒక కుటుంబం.. ఒక పారిశ్రామిక వేత్త లో భాగంగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఒక కుటుంబం.. ఒక పారిశ్రామిక వేత్తలో భాగంగా ఎంట్రప్రెన్యూర్షిప్ యాక్షన్ ప్లాన్ 2025-2026 అమలుకు సంబంధించి మెప్మా, మున్సిపల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్లో భాగంగా జిల్లాకు 2827 ఎంఎస్ఎంఈల ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, మెప్మా, మున్సిపల్ అధికారులు ఈ లక్ష్యాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు..మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్, ఫుడ్ సర్వీసెస్, రిటైల్ షాపులు,ఇతర సేవా రంగాలతో పాటు ఇంకా మెరుగుపరచడానికి స్పెషల్ ప్రాజెక్ట్స్ ర్యాపిడో సర్వీసెస్, తృప్తి క్యాంటీన్లు, టూరిజం సర్వీసెస్ లాంటి రంగాల్లో యూనిట్లను స్థాపించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై త్రైమాసిక లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, వీటిని సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ నాగ శివ లీల, ఎల్డిఎం, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జిఎండిఐసి అరుణ పాల్గొన్నారు.

## శ్రీ తిరుపతి గంగమ్మ జాతర విజయవంతం కావడంతోగ్రామ పెద్ద రఘుచంద్ర గుప్తాను సత్కరించిన గ్రామస్థులు



**బైరెడ్డిపల్లి/పెన్ పవర్/ఏప్రిల్26 :** బైరెడ్డిపల్లి మండలంలోని లక్కనపల్లిలో ఇటివలన శ్రీ తిరుపతి గంగమ్మ జాతర విజయ వంతంగా ముగియడంతో గ్రామ పెద్ద రఘుచంద్ర గుప్తాను గ్రామస్థులు శనివారం శాలువతో, పూలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమ్మవారి జాతర చాలా కాలం తరువాత గ్రామస్థుల సహకారంతో విజయవంతం కావడానికి కారణం అయిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# పులివెందుల సబ్ జైలు విజిట్



**పులివెందుల, పెన్ పవర్, ఏప్రిల్ 26 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ను విజిట్ చేయడం జరిగింది.

రిజిస్టర్లను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, వంట గదిని, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగింది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమములో పులివెందుల సబ్ జైలు సూపర్డెంట్, ప్యానల్ న్యాయవాది, పారా లీగల్ వాలంటరీ మరియు ఖైదీలు పాల్గొన్నారు.




## పారిశుధ్యం, రోడ్లు, త్రాగునీటి సరఫరా, వీధి లైట్లకు అధిక ప్రాధాన్యత : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి






**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** ప్రభుత్వం పథకాలు, పారిశుధ్యం, రోడ్లు, త్రాగునీటి సరఫరా, వీధి ల్కెట్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. శనివారం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పారిశుద్ధ్యం కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, సూపరిండెంట్ ఇంజనీర్, సానిటరీ ఇన్స్పెక్టర్లు, అనంతపురం సానిటరీ సెక్రటరీలు తదితరులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లాలోని వివిధ పథకాలను అమలు, వివిధ రకాల పనులను కలెక్టర్ల ద్వారానే నిర్వహించే పద్ధతి ఉందని తెలియజేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ ఆర్డి విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, సూపరిండెంట్ ఇంజనీర్, సానిటరీ ఇన్స్పెక్టర్లు, అనంతపురం సానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంలో నిర్దేశించిన అంశాలను పకడ్బందీగా అమలు చేస్తూ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధంపై పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ, ఎన్టీఆర్ వైద్య సేవ కార్యక్రమాల అమలుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధంపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. నిషేదిత చట్టంలోని నిబంధనల మేరకు స్కాన్ సెంటర్లు లేదా డయాగ్నస్టిక్ సెంటర్లు లింగ నిర్ధారణ చేసినట్లయితే కఠిన చర్యలు తప్పవన్నారు. లింగ నిర్ధారణ కోసం ప్రయత్నించినా లేదా ప్రోత్సహించిన వారిపై కూడా చర్యలు తప్పవన్నారు. ప్రతి ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులలో ఈ చట్టంపై అవగాహన కోసం ఫ్లెక్సీల బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. కొత్త స్కాన్ సెంటర్స్ తప్పనిసరిగా జిల్లా కమిటీ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రతి 5 సంవత్సరాలకు రెన్యూవల్ నిమిత్తం నెల రోజుల ముందే అప్లై చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రెన్యువల్కు వచ్చే స్కానింగ్ కేంద్రాలు హైపవర్ మిషన్ వాడాలని లేనిపక్షంలో రెన్యువల్ నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై స్త్రీ శిశు సంక్షేమం, మహిళా సంఘాలు, పోలీస్ వారి సహకారంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో లింగానిర్ధారణ పరీక్షలు జరగకుండా పోలీసు అధికారులతో వైద్యులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవ క్రింద ప్రజలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించకుండా నగదు వసూలు చేసినట్లు 8 ఆసుపత్రుల్లో 33 ఫిర్యాదులు నమోదు అయ్యాయని వారికి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ డిఎంహెచ్ఓను ఆదేశించారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీ కోసం డిఓ లేఖను సిద్ధం చేయాలని కలెక్టర్ డిఎంహెచ్ఓను ఆదేశించారు.

చట్ట వ్యతిరేకంగా పరీక్షలు చేసిన వైద్యులుకు మొదటి సారి తప్పుకు 10 వేలు జరిమానా, 3 సంవత్సరాల జైలు శిక్ష, రెండవ సారి తప్పు చేస్తే 50వేలు, 5 సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందన్నారు. మూడవ సారి అదే తప్పు చేస్తే వైద్యుల పేర్లు కౌన్సిల్ నుండి పేరు తొలగించడం జరుగుతుందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలకు ప్రోత్సహించే వారికీ 3 సంవత్సరాల జైలు మరియు 50 వేలు జరిమానా, రెండవ ధపాకు 5 సంవత్సరాలు జైలు మరియు లక్ష రూపాయలు జరిమానా విధించబడుననే అంశాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ స్కానింగ్ కేంద్రాల దరఖాస్తులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ఓ వెంకటరమణ, సిఐ సూర్య మౌళి, మదర్ సొసైటీ ఎన్జిఓ రామారావు, ఇంచార్జ్ డిసిహెచ్ఎస్ డా.ఓ.లలిత, ఎన్టీఆర్ వేద సేవ కోఆర్డినేటర్ డా. రూపేంద్ర నాథ్ రెడ్డి, ఇంచార్జ్ డెమో కె రవీంద్ర నాయక్, జిల్లా మానిటరింగ్ అధికారి సుమలత, వంశీ పాల్గొన్నారు.

## ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేను జయప్రదం చేయాలి



కడప పెన్ పవర్ ఏప్రిల్ 26 : కరపత్రాల ఆవిష్కరణలో ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బండి. రామలింగారెడ్డి పిలుపు నిచ్చారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే ను జయప్రదం చేయాలని ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్( ఏఐటీయూసీ అనుబంధ సంఘం) రాష్ట్ర అధ్యక్షులు బండి. రామలింగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నాటి. బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కడప డివిజన్ ఆఫీస్ లో మేడే కు సంబందించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ చారిత్రాత్మకమైన మేడే "ను కార్మిక వర్గ సంఘీభావాన్ని తెలియజెప్పే అంతర్జాతీయ దినంగా యావత్ ప్రపంచము జరుపుకుంటున్నది కేవలం దీనిలో ఉన్న విప్లమశాన్ని విస్మరించి మొక్కుబడిగా జరుపుకునే ఒకానొక ధోరణి ఇటీవల కాలంలో కార్యవర్గంలో తలెత్తుతున్నది అన్నారు. హే మార్కెట్ అమరవీరుల త్యాగాలను మాటల్లో కీర్తించినప్పటికీ పెట్టుబడి దారుల దాడులకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడంలో విఫలమయ్యారని చెప్పొచ్చు అన్నారు. ఒకవైపు నయా ఉదారవాద విధానలను అనుసరిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని త్రిప్పి కొట్టేందుకై కార్మిక వర్గాన్ని ఐక్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యుత్ సంస్థను ప్రైవేటీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం తహ తహ లాడుతుంది, ఆదానికి విద్యుత్ రంగాన్ని ఇవ్వాలని శరవేగంగా అడుగులు వేస్తుందని అన్నారు. అందులో భాగంగానే ఉత్తరప్రదేశ్ లో చండీగఢ్ పంజాబ్ లో డిస్కం ల ను ప్రైవేటుకరించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఏపీ జెన్కోలను స్టాక్ ఎక్స్ఛేంజి లోకి తీసుకురావాలని కేంద్రం కోరిందని దానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అంగీకరించిందని మరోవైపు స్మార్ట్ మీటర్ల పేరుతో శ్రీకాకుళం జిల్లా నుంచి మొదలుపెట్టి రాష్ట్రమంతా చరవేగంగా అమలు చేయడం జరిగిందన్నారు2003 విద్యుత్ చట్టానికి 2022 పేరుతో సవరణలు తెచ్చి మొత్తం విద్యుత్ రంగాన్ని ఆదానికి ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకుని విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేస్తామనే మాట ఆటకెక్కిందని 1/4/2022పిఆర్సిలో జరిగిన ఒప్పందం లో కాంట్రాక్ట్ కార్మికులకు అరియర్స్ ఇంతవరకు ఇవ్వలేదని ఉద్యోగుల కు సకాలంలో డీఎలు రాలేదని, అపరిమిత నగరహిత వైద్యం అందలేదని, ఇపిఎఫ్ నుండి జిపిఎఫ్గా మార్పు జరగలేదని అన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల బిల్ రీడర్ల ఉపాధి పై నష్టం ఉన్నందున వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎనర్జీ అసిస్టెంట్లకు ఏపీఎస్ఇబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని వారిని విద్యుత్ ఉద్యోగాలు గుర్తించాలని అన్నారు. నూతన షిఫ్ట్ ఆపరేటల కు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా నాయకులు దస్తగిరి,రామాచెంద్రారెడ్డి, చెన్నకేశవ రెడ్డి, కొండారెడ్డి,సురేష్,ఎనర్జీ అసిస్టెంట్ నాయకులు, ఆజి బాషా,కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి, ఉపాధ్యక్షులు రామ కేశవులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి





**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా చర్యలను, లాక్ బుక్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ల వద్ద ఎలాంటి లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని ఏఎస్ఐని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## మదర్ థెరిసా కళాశాల విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి



**పలమనేరు ఏప్రిల్ 26, (పెన్ పవర్) :** నియోజకవర్గ పరిధి గంగవరం మండలంలో ఓ విద్యార్థి శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.స్థానికుల కథనం మేరకు వివారాలిలా.. మేలుమాయి పంచాయతీకి సమీపంలోని మదర్ థెరిసా కళాశాల నందు కుప్పం నియోజకవర్గ పరిధి శాంతిపురం మండలం గెసికపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు యోగేష్ (16) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివి పరీక్షలు రాయగా, ఇటీవల విడుదలైన ఫలితాల్లో రెండు సబ్జెక్టులలో తప్పినట్లు తెలిసింది.కాగా ఇందుకు సంబంధించిన సబ్జెక్టులపై సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి కళాశాలలోనే నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు శనివారం హాజరై, విరామ సమయంలో కళాశాలలోని హాస్టల్ గదిలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.కాగా పరీక్షలలో తప్పినప్పటి నుండీ విద్యార్థి యోగేష్ తీవ్రమైన ఒత్తిడికి గురైనట్లు తెలిసింది. మృతి చెందడానికి ముందు తనను క్షమించండి నాన్నా అని ఒక నోట్ రాసి పెట్టినట్లు కూడా తెలిసింది. మృతి చెందిన విద్యార్థిని పంచనామా నిమిత్తం పోలీసులు పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థిమృతికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాలసి ఉంది.

## 28 న పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ : జిల్లా కలెక్టర్




**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** ఏప్రిల్ 28న సోమవారం పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు మందిరంలో ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ను ఉ.9.30 గం.ల నుండి మ.1 గం.వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. పలమనేరు రెవిన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల కొరకు ప్రత్యేకంగా ఏప్రిల్ 28న సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. పలమనేరు రెవిన్యూ డివిజన్ పరిధి లో ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నందున జిల్లా కేంద్రంలో జరుగు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రద్దు చేస్తున్నట్లుఈ విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి తెప్పోత్సవాలు





**కడప పెన్ పవర్ ఏప్రిల్ 26 :** దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మే 10 నుండి 12వ తేదీ వరకు తెప్పోత్సవాలు జరుగనున్నాయి. స్వామి, అమ్మవార్లు ఆలయ పుష్కరిణిలో ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు తెప్పలపై విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఇందులో భాగంగా మే 10న శ్రీ కృష్ణ సమేత గోదాదేవి మూడు చుట్లు, మే 11న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారు ఐదు చుట్లు, మే 12న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారు ఏడు చుట్లు తెప్పలపై తిరిగి కనువిందు చేయనున్నారు. ఈ మూడు రోజుల పాటు ఉదయం 10 నుండి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## తేనె టీగల పెంపకంపై ఏడు రోజుల శిక్షణ




**నంద్యాల పెన్ పవర్ ఏప్రిల్ 26 :** నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో చెంచు కుటుంబాలకు తేనెటీగల పెంపకంపై ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది ఈ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట శివప్రసాద్ సహా పరిశోధన సంచాలకులు ఏడిఆర్ డాక్టర్ జాన్సన్ జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ శివప్రసాద్ మాట్లాడుతూ చెంచుల జీవనోపాధిని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు అందులో భాగంగా తేనెటీగల పెంపకం పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తేనెటీగలకు అవసరమైన బాక్సులను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు ఈ సందర్భంగా డాక్టర్ ఎం జాన్సన్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ వ్యవసాయ పరిశోధనా స్థానము నంద్యాల వారు మాట్లాడుతూ ఈ ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం తేనెటీగల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు నవలంబించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటకు దోహదపడుతుంది అని పేర్కొన్నారు అదేవిధంగా తేనెటీగల పెంపకం చేపట్టినట్లయితే తేనెటీగల వలన పంట సాగులో పుష్పాలన్ని కూడా బాగా ఫలదీకరణం చెంది అధిక దిగుబడి పొందటానికి తేనెటీగల పెంపకం దోహ దపడటంతో పాటుగా వీటి పెంపకం వలన అదనపు ఆదాయం కూడా పొందవచ్చని రైతులను ఉద్దేశించి సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు మేనేజర్ శ్రీ ఏజీ నాయక్ గారు వ్యవసాయ శాస్త్రవేత్తలు వారి సిబ్బంది వెలుగు సిసి వీరన్న గ్రామ ప్రజలు పాల్గొన్నారు ఈ సందర్భంగా శిక్షణ పొందినటువంటి వారికి తేనెటీగల పెంపకానికి తేనెటీగల పెట్టెలు శిక్షణ పొందిన వారికి ఇవ్వడం జరిగింది. ఏడు రోజుల శిక్షణ కార్యక్రమానికి పూర్తి చేసుకున్నటువంటి వారికి సర్టిఫికెట్లు కూడా ప్రధానం చేయడం జరిగింది.

## పేదలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

### కుప్పం రూరల్ టిడిపి అధ్యక్షులు ప్రేమ కుమార్




**కుప్పం/పెన్ పవర్/ఏప్రిల్ 26 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలను ఆదుకుంటున్నారని కుప్పం రూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్ అన్నారు. శనివారం కుప్పం బైపాస్ రోడ్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎన్నో కుటుంబాలను ఆదుకుంటున్న చంద్రబాబునాయుడు మేలును మరిచిపోకూడదన్నారు. కుప్పం మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి అప్లై చేసుకున్నవారికి, ముఖ్యమంత్రి పంపిన10 లక్షలు విలువ చేసే, చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, సర్పంచ్ రవి, నాయకులు చంద్ర, సంజీవి, రామచంద్ర, పువి,శివ, నరసింహులు, జనార్ధన్, తిరుపతి,శ్రీనివాసులు, పుల్లయ్య పాల్గొన్నారు.

## కుప్పంలో 144 సెక్షన్ అమలు

### కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు రాజు



**కుప్పం/పెన్ పవర్/ఏప్రిల్ 26 :** కోపంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు కుప్పం రెవెన్యూ సబ్ డివిజన్ అధికారి శ్రీనివాసులు రాజు తెలిపారు. ఈనెల 28వ తేదీ సోమ వారం కుప్ప మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరుగుతున్నందున 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరిగే మండల పరిషత్ కార్యాలయానికి 100 మీటర్ల వరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

## వేసవి సమయంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడండి-ఎంపీపీ చింతం రెడ్డి పద్మావతి సుబ్బారెడ్డి




**సీతారామపురం పెన్ పవర్- ఏప్రిల్ 26 :** ప్రస్తుత వేసవికాలంలో రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా మండలంలోని 14 పంచాయతీలలో ఎక్కడ మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మండల ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం నాడు మండల సర్వసభ్య సమావేశంలో చింతం రెడ్డి పద్మావతి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు పోవాలని తెలిపారు. ఎన్.ఆర్.ఈ.జీఎస్ పనులు జరిగే ప్రాంతాలలో కూలీలకు మంచినీరు, ముఖ్యంగా చల్లని నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో వృద్ధులు విశ్రాంతి తీసుకునే విధంగా తాత్కాలిక పట్ట షెల్టర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరమైన చోట మంచినీటి చేతిపంపులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతానని తెలిపారు. వ్యవసాయ శాఖ పశుసంవర్ధక శాఖ ఇరు శాఖలు సమన్వయం చేసుకొని గొర్రెల కాపరులకు త్రాగునీటి తొట్లు, బర్రెల మీసేందుకు గడ్డి పెంపకం,వేసవి సమయంలో కాపరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారికి వివరించాలని తెలిపారు.

## వర్షాకాలానికి ఇసుక నిలువలు 70,000 మెట్రిక్ టన్నులు ఉంచాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 26 :** జిల్లాలో వర్షాకాలానికి ఇసుక నిలువలు సుమరుగా 70,000 మెట్రిక్ టన్నులు ఉంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక నిలువలు సుమరుగా 70,0000 మెట్రిక్ టన్నెలు ఉంచాలని, ఎక్కడా అక్రమ రవాణా జరగకుండా గట్టి నిఘా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు స్థాపించి నిఘా కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ శాఖ సిబ్బందిని, ఆర్టీవో సిబ్బందిని నియమించాలని, ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం అమలులో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టాక్ యార్డు వద్ద సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అత్యంత పారదర్శకంగా ఇసుక పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టాలండ్స్ నందు అనుమతి ఇవ్వడం కొరకు, పర్యావరణ మరియు కాలుష్య నియంత్రణ ఆర్యాలయం నుండి త్వరితగతిన అనుమతులు పొందాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మైన్స్ డిడి వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, ఆర్టీవో సురేష్ నాయుడు, ఇరిగేషన్ ఈఈ నారాయణ నాయక్, మైన్స్ ఏజి ఆదినారాయణ, తాడిపత్రి ఎడి ఓబుల్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయంలో కన్నుల పండుగగా మొదటి వార్షికోత్సవ పూజలు









సత్యవేడు/పెన్ పవర్/ ఏప్రిల్ 26 : సత్యవేడు మండలం ఇరుగుళం శ్రీ ఉమాదేవి సమేత ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మొదటి వార్షికోత్సవ పూజలు కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ పునరుద్ధరణ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆలయ ధర్మకర్త,సత్యవేడు ఎంపీపీ ప్రతిమసుశీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శని వారం మొదటి వార్షికోత్సవ పూజలు కన్నుల పండుగ జరిగింది. ఈ నేపథ్యంలో ఆలయంలో శ్రీఉమా మహేశ్వరస్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రత్యేక రుత్వికులు బాలసాగరశర్మ, త్యాగరాజుగురుకుల్ బృందం ఆలయ ప్రాంగణంలో రెండు ప్రధాన కలశాలను ప్రతిష్టించి పూజలు జరిపారు. అనంతరం యధావిధిగా విఘ్నేశ్వర పూజ, పుణ్యా వాచనం, యజమానుల గ్రామ సంకల్పం, దేవతా పూజలు, అమ్మవారికి శాంతి హోమం, నవగ్రహ పూజలు, వేదఉపచారం వంటి పూజాక్రతులను మంగళ వాయిద్యాలు,భక్తుల హరినామ స్మరణాల మధ్య నిర్వహించడం జరిగింది.

అంతకు మునుపు ప్రధాన కళాశాల వద్ద శుద్ధ జలాలతో నిండిన 108 కలస సంకువలను ప్రతిష్టించి విశేష పూజలు నిర్వహించడం పాటు హోమం కూడా నిర్వహించారు. తదనంతరం కలస సంకు జలాలతో,సుగంధ ద్రవ్యాలతో శ్రీఉమామహేశ్వరస్వామి వారిని అభిషేకించిన తర్వాత స్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామివారికి మహా హారతి ఇచ్చారు.

కాగా ఆలయ కమిటీ అధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి,సెక్రటరీ ప్రతాపరెడ్డి, ట్రెజరర్ శశికిరణ్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి తదితరులు మొదటి వార్షికోత్సవ పూజలను పర్యవేక్షించారు. సాయంత్రం 6 గంటల సమయంలో ఉత్సవ మూర్తులు ఆలయం చుట్టూ ఊరేగనున్నారు.ఈ పూజలకు ఇరుగుళం గ్రామం నుంచి కాక సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వార్షికోత్సవ పూజలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. మొదటి వార్షికోత్సవ పూజలను పురస్కరించుకొని ఆలయంలో అన్నదానం కార్యక్రమం జరిగింది.

## రాజధాని అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలి : డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి



**కడప పెన్ పవర్ ఏప్రిల్ 26 :** ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలని రాజ్య సభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగాలలో స్థానిక,స్థానికేతరకు సంబంధించి రాష్ట్రాన్ని నాల్గు జోన్లుగా విభజించారు. పాత జిల్లాల వారీగా శ్రీకాకుళం, విజయనగరం,విశాఖ పట్నం 1వ జోన్‌లో, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి,కృష్ణా జిల్లాలు 2వ జోన్‌లో, గుంటూర్,ప్రకాశం, నెల్లూరు జిల్లాలు 3వ జోన్‌లో,'డప,కర్నూల్, చిత్తూర్, అనంతపురం జిల్లాలు 4 వ జోన్ పరిధిలోకి వస్తాయి. రాజధాని అమరావతి 3వ జోన్ పరిధిలోకి వస్తుంది. రాజధాని ప్రాంతం లో విద్యా,ఉద్యోగ అవకాశాలు మిగతా ప్రాంతాల కంటే ఎక్కువగా ఉంటాయి. రాజధాని అన్ని ప్రాంతాలకు సంబంధించినది. అక్కడ అన్ని ప్రాంతాలవారికి సమాన అవకాశాలు లభించాలంటే రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్ గా ప్రకటించాలి.

గతం లో ఉమ్మడి రాష్ట్రం లో 1975 నాటి ప్రెసిడెన్సియల్ ఆర్డర్ ద్వారా రాజధాని హైదరాబాద్ లో సచివాలయం,హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్లు, రాష్ట్ర స్థాయి కార్యాలయాలన్నిటిని ఫ్రీ జోన్‌గా ప్రకటించడం జరిగింది. అదేవిధంగా నవ్యాంధ్ర ప్రదేశ్ లో రాజధాని అమరావతి ప్రాంతాన్ని ఫ్రీ జోన్ గా ప్రకటించాలి అని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

ప్రధాన మంత్రి గారూ! శంఖు స్థాపనతో పాటు నిధులు కూడా ఇవ్వండి. ప్రధాని మోడీ గారు 2015 అక్టోబర్ 22 న ,విజయదశమి నాడు పార్లమెంటు మట్టి, యమునా నది నీటిని తెచ్చి ప్రజా సమక్షం లో ఉద్దండ రాయుని పాలెం వద్ద అమరావతి రాజధానికి శంఖు స్థాపన చేసారు. నిధులు లేని కారణంగా, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగ లేదు. మళ్ళీ 2025 మే 2న రాజధాని అమరావతికి శంఖు స్థాపన చేయబోతున్నారు. ఈ సారైనా రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేయాలి. శంఖు స్థాపన సందర్భంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా,రాయలసీమ,ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ,కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యం లో ఉక్కు కర్మాగారం, దుగరాజపట్నం ఓడ రేవు తదితర అంశాలపై సానుకూల ప్రకటన చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

## విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు



**కావలి పెన్ పవర్ - ఏప్రిల్ 26 :** కావలి విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రిన్సిపాల్‌గా ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. వీరు గతంలో పీజీ సెంటర్ స్పెషల్ ఆఫీసర్‌గా, ప్రిన్సిపాల్‌గా, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్‌గా, ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా విక్రమ సింహపురి యూనివర్సిటీ లో పనిచేసారు. ప్రస్తుతం కామర్స్ విభాగానికి హెడ్ గా, కామర్స్ విభాగానికి, టూరిజం మేనేజ్మెంట్ విభాగానికి, బిఓఎస్ చైర్మన్ గా ఉన్నారు. ముప్పై సంవత్సరాల బోధన పరిశోధన అనుభవం ఉంది, 14 పుస్తకాలు మరియు వివిధ జాతీయ అంతర్జాతీయ పత్రికలలో 39 పరిశోధనా పత్రాలు ప్రచురించారు. 3 జాతీయ సెమినార్ లు ఆర్గనైజ్ చేసారు. అనేక ప్రాజెక్టులు పూర్తి చేశారు.

## నీట మునిగి నలుగురు గల్లంతు



**అన్నమయ్య పెన్ పవర్ ఏప్రిల్ 26 :** అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు పెద్ద చెరువులో శనివారం సాయంత్రం నీట మునిగి నలుగురు గల్లంతయ్యారు. మృతదేహాలు లభ్యం... మల్లేష్ 36, లావణ్య12, నందిత 11, నందకిషోర్ 10...గా పోలీసులు గుర్తించారు.. చెరువులో మృతదేహాలను ములకలచెరువు మండలం ఎస్సై నరసింహుడు మరియు సుమన్ టీవీ రిపోర్టర్ విజయకుమార్,తదితరులు వెలికి తీశారు.

## పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో జిల్లావ్యాప్త భద్రతా చర్యలు.. కట్టుదిట్టమైన తనిఖీలు





చిత్తూరు/ పెన్ పవర్/ ఏప్రిల్ 26 : పహల్గాం ప్రాంతంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడి దృష్ట్యా, రాష్ట్ర ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలని గౌరవ డీజీపీ శ్రీ హరీష్ కుమార్ గుప్తా రాష్ట్రంలోని అన్ని కమిషనరేట్లు మరియు జిల్లాల్లో 26-04-2025 నాటి సాయంత్రం 4.00 గంటల నుండి 6.00 గంటల వరకు ప్రత్యేక భద్రతా తనిఖీలను చేపట్టాలని ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు ఆధ్వర్యంలో, ఈరోజు జిల్లా వ్యాప్తంగా దేవాలయాలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, లాడ్జిలు తదితర ప్రదేశాలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించడమేకాక, ముఖ్య కూడళ్లలో వాహనాలను సమగ్ర తనిఖీలు చేపట్టారు. ఈ భద్రతా తనిఖీలను మరింత ప్రభావవంతంగా అమలు చేసేందుకు చిత్తూరు జిల్లా ఎస్పీ గారు స్వయంగా పాల్గొని పట్టణంలోని ప్రధాన కూడలి అయిన రెడ్డిగుంట జంక్షన్ వద్ద తనిఖీలను నిర్వహించారు.లి

ఈ తనిఖీలలో చిత్తూరు జిల్లాలోని ప్రసిద్ధగాంచిన శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం నందు చిత్తూరు జిల్లా బాంబు స్క్వాడ్ వారు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణములోని బస్టాండ్, రైల్వే స్టేషన్ మరియు ఇతర జనసమ్మేళన ప్రదేశాల నందు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ ద్వారా అనుమానిత వ్యక్తులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, విదేశీ వ్యక్తులు, వలస వచ్చినవారి సమాచారం సేకరించడం, వారి గుర్తింపు పత్రాలను పరిశీలించారు. బయటి నుంచి వచ్చిన వ్యక్తులు నివసించే హోటళ్లు, లాడ్జిలను పోలీసులు పరిశీలించి, అక్కడ బస చేస్తున్న వ్యక్తుల పూర్తి వివరాలను సేకరించారు. వారి గుర్తింపు పత్రాలను ధృవీకరించి, వారి రాకపోకలపై సమగ్ర సమాచారం పొందడం ద్వారా నేర నిరోధక చర్యల్లో జాగ్రత్తలు తీసుకున్నారు. చిత్తూరు జిల్లా రెండు రాష్ట్రాలకు సరిహద్దు జిల్లాగా ఉన్న కారణంగా, జిల్లాసరిహద్దులు మరియు ప్రవేశ/నిష్క్రమణ పాయింట్ల వద్ద వాహనాలను సమగ్రంగా తనిఖీ చేయడం జరిగింది. ప్రత్యేకంగా, జిల్లాల మధ్య సంచరించే అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి ఈ తనిఖీలు నిర్వహించబడ్డాయి.

**తనిఖీల వివరాలు:**

ఈ తనిఖీలో బాగంగా జిల్లా వ్యాప్తంగా 2378 వాహనాలను తనిఖీ చేయగా, మోటార్ వెహికల్ ఆక్ట్ కింద 188 కేసులు నమోదు చేసారు. 74,195/- రూపాయల ఫైన్ విధించడం జరిగింది. బహిరంగంగా మద్యం సేవిస్తున్న 07 మంది పై కేసులు నమోదు చేసి జరిమానా విధించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 65 లాడ్జిలలో 395 రూమ్లను తనిఖి చేయడం జరిగింది. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లలో 268 మంది అనుమానాస్పద వ్యక్తులను తనిఖి చేసారు. ఈ కార్యక్రమం ప్రజలకు భద్రత కల్పించడమే కాకుండా, ఏవైనా అపాయాలను ముందుగానే గుర్తించి నివారించడమే ప్రధాన ఉద్దేశ్యంగా చేపట్టామని, జిల్లా వ్యాప్తంగా పోలీస్ విభాగం పూర్తి అప్రమత్తతతో పని చేస్తోందని, ప్రతి పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం ప్రజల రక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాము. "ప్రజల భాగస్వామ్యంతోనే భద్రతను పరిరక్షించగలం. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా చిత్తూరు పోలీస్ వాట్సాప్ నెంబర్ 9440900005కు సమాచారం ఇవ్వాలని, భద్రతా చర్యలు మీ భద్రత కోసమే చేపడుతున్నాం. పోలీసు శాఖ ప్రజల రక్షణకు కట్టుబడి ఉంది" అని జిల్లా ఎస్పీ తెలిపారు.

## ట్రైనీ ఐ.పి.ఎస్ బి హేమంత్‌కి అభినందన.. వీడ్కోలు



**తిరుపతి/పెన్ పవర్/ ఏప్రిల్ 26 :** ప్రాక్టికల్ ట్రైనింగ్ ఆరునెలలు పూర్తిచేసుకుని వెళుతున్న ట్రైనీ బి.హేమంత్‌కి అభినందన వీడ్కోలు సభను తిరుపతి జిల్లా పోలీసు గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు జిల్లా పోలీసు అధికారులు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రైని హేమంత్ గురించి చెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు. హేమంత్ నా వద్ద ట్రైనింగ్ తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. హేమంత్ ముగ్గురు ఎస్పిల వద్ద పని చేశారు. పోలిసింగ్ అనేది ఒకరికి ఒక అవకాశం, ప్రజా సేవ అనేది పోలిసింగ్ తోనే చేస్తామన్నారు. మనం పేరు కోసం పని చేయకుదు.. సమాజానికి ఎమికావాలో తెలుసుకుని టెక్నాలజీ పరంగా ఎంత కావాలో అంత మోతాదు లో తీసుకున్నప్పుడే మనం సక్సెస్ అవుతుందన్నారు. ఎన్ని కష్టాలు వచ్చిన ఎలాంటి ఇబ్బందులు వచ్చిన కూల్ గా ముందుకు వెళ్ళాలన్నారు. నాయకత్వం అన్నది... మనలోంచి కనపడాలన్నారు. అప్పుడే సక్సెస్‌ఫుల్ ముందు వెళ్ళతామని, తిరుపతి జిల్లా అనేది ఒక ప్రత్యేకమైంది. తిరుపతిలో వివిధ రకాల ఉద్యోగం చేసే దానికి అవకాశం ఉంటుందన్నారు. అలా ఉన్నప్పుడే.. మన ఆ లోచనలకు పొదును పెడతామని, నేను హైదరాబాదులో ఉద్యోగం చేసినప్పుడు తెల్లవారు జామున మూడు గంటలకు నిద్రలెచి ఎప్పుడూ నిద్రపోతామే తెలియదన్నారు. తిరుపతి లాంటి జిల్లాలో మీరూ ట్రైనింగ్ పొందటం చాలా సంతోషంగా ఉందన్నారు. బేసిక్ పోలీసింగ్ అనేది చాలా ముఖ్యమని, అలా చేసినప్పుడే ప్రజల మన్ననలను పొందుతామన్నారు. పోలీసింగ్ అనేది ప్రతి విషయాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు వెళ్ళాలన్నారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ ఐపిఎస్ ఆఫీసర్ బి.హేమంత్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో పనిచేయటం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎస్పీ వద్ద పని చేయడం ఒక బ్లూప్రింట్ మాదిరిగా ఉంటుందన్నారు. నేను ఎస్పి వద్ద నేర్చుకున్న విషయాలతో ప్రొఫెషనల్‌గా పని చేస్తానన్నారు. ఉద్యోగం విధానంలో తీసుకునే నిర్ణయాలు చాలా స్పష్టంగా ఉంటాయన్నారు. జిల్లాలో ఎస్పీ చేసిన వినూత్న కార్యక్రమాలు ఓపెన్ బుజింగ్, పల్లె నిద్ర, బహిరంగ ప్రదేశాల్లో శుభ్రం చేయటం, విజిబుల్ పోసింగ్ చాలా బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎస్పీలు జె.వెంకటరావు పరిపాలన కె.రవి మనోహరాచారి శాంతి పద్ధతులు, ఐ.రామకృష్ణ తిరుమల, డీఎస్పీలు, సాదిక్ ఆలీ సీఐ ఎస్బి ఈశ్వర్ సీఐ కంట్రోల్ రూమ్ పాల్గొన్నారు.

## ప్రైవేటు బస్సు బోల్తా.. ప్రయాణికులకు స్వల్ప గాయాలు

**నరసరావుపేట: పెన్ పవర్:** నరసరావుపేట శివారు శాంతి నగర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ నుండి చీరాల వెళుతుండగా జరిగిన ప్రమాదం జరిగింది. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, నరసరావుపేట డిఎస్పీ , నాగేశ్వరరావు,ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

## బ్యాన్ కీరవాణి....

**హైదరాబాద్, ఏప్రిల్ 26, పెన్ పవర్:**గత కొద్దిరోజుల నుండి ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణి పై పలు ఆరోపణలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. మ్యూజిక్ డైరెక్టర్ గా ఎంతో బిజీ గా గడుపుతున్న ఆయన, ఈటీవీ షో లో 24 సీజన్స్ ని పూర్తి చేసుకున్న 'పాడుతా తీయగా' సింగింగ్ షోలో న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నాడు. ఈ షో ద్వారా రీసెంట్ గానే ఎలిమినేట్ అయినా ప్రవస్తి కీరవాణి, చంద్రబోస్ , సునీత వంటి వారిపై తీవ్రంగా విరుచుకుపడిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ వ్యవహారం పై కీరవాణి ఇప్పటి వరకు ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వలేదు. దశాబ్దాల నుండి ఇండస్ట్రీ లో ఉంటున్న కీరవాణి పై ఇప్పటి వరకు ఇలాంటి సంచలన ఆరోపణలు ఎవ్వరూ చెయ్యలేదు. ఆ అంశంపై కీరవాణి కి సపోర్ట్ చేసే వాళ్ళు కొంత మంది ఉంటే, వ్యతిరేకించే వాళ్ళు కూడా కొంతమంది ఉన్నారు.కానీ కీరవాణి ఒక సింగింగ్ షోలో క్రిస్టియన్ మతాన్ని పొగుడుతూ హిందూ మరియు ఇతర మతాలను అగౌరవపరిచాడు అంటూ కొన్ని హిందూ సంఘాలకు చెందిన ప్రముఖులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇంతకు ఆయన ఏమన్నాడంటే 'నేను అన్ని మతాలను సమానంగా గౌరవిస్తాను. కానీ క్రిస్టియన్ మతం అంటే కొంచెం ఎక్కువ ఇష్టం. ఎందుకంటే కేవలం ఈ మతం లో మాత్రమే క్షమించే తత్త్వం ఉంటుంది. మిగతా మతాల్లో అది కనపడదు' అంటూ చెప్పుకొచ్చాడు. దీనిపై నెటిజెన్స్ మామూలు రేంజ్ లో ఫైర్ కాలేదు. ముఖ్యంగా హిందూ మతానికి సంబంధించిన వారు అయితే కీరవాణి ని ఏకిపారేస్తున్నారు. ఇతని సినిమాలు బ్యాన్ చేయాలి అంటూ ట్వీట్స్ వేస్తున్నారు. ఒక గురువును కీరవాణి ని ఉద్దేశిస్తూ మాట్లాడిన కొన్ని మాటలు ఇప్పుడు సోషల్ మీడియా లో సంచలనంగా మారాయి. ఇంతకు అతను ఏమి మాట్లాడాడో క్రింది వీడియో లో చూడండి.ఇక కీరవాణి ప్రస్తుతం చేస్తున్న సినిమాల విషయానికి వస్తే మెగాస్టార్ చిరంజీవి తో 'విశ్వంభర' చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తి అయ్యింది. రీసెంట్ గానే 'రామ రామ' అనే పాట కూడా విడుదలై మంచి రెస్పాన్స్ ని సొంతం చేసుకుంది. అదే విధంగా పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రానికి కూడా ఆయన సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే రెండు పాటలు విడుదలై ఆడియన్స్ నుండి మంచి రెస్పాన్స్ ని సొంతం చేసుకుంది. ఈ రెండు కాకుండా ప్రస్తుతం పాన్ వరల్డ్ చిత్రం మహేష్ బాబు, రాజమౌళి చిత్రానికి కూడా ఈయనే సంగీత దర్శకుడు.

## దానం కారులో ఖర్చీఫ్

**హైదరాబాద్, ఏప్రిల్ 26, పెన్ పవర్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీకి దూరం అయ్యేటట్లే కనిపిస్తున్నారు. ఆయన చేస్తున్నవ్యాఖ్యలు, చేస్తున్న పనులు మళ్లీ బీఆర్ఎస్ కు దగ్గరయ్యేందుకేనన్నది స్పష్టంగా అర్థమవుతుంది. అందుకే తరచూ ఆయన చేస్తున్న కామెంట్స్ అధికార పార్టీకి వ్యతిరేకంగా, తాను ఎన్నికై బయటకు వచ్చిన బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా మారుతున్నాయి. ఈ సౌండ్ విన్న వారికి ఎవరికైనా దానం నాగేందర్ ఖచ్చితంగా తిరిగి కారు ఎక్కేందుకేనన్నది చిన్న పిల్లాడికి కూడా అర్థమవతుంది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఖైరతాబాద్ నియోజకవర్గంలో గెలిచిన దానం నాగేందర్ తర్వాత కాంగ్రెస్ కు అనుకూలంగా మారారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.మొదటి నుంచి అంతే... అంతటితో ఆగకుండా సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కూడా 2024లో పోటీ చేసిన దానంనాగేందర్ ఓటమి పాలయ్యారు. అయితే గత కొంతకాలంగా అధికార పార్టీ నిర్ణయాలను బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు. హైడ్రా కూల్చివేతలను ఆపేయాలనంటూ ఆయన హుకుం జారీ చేశారు. హైడ్రా వల్ల ప్రభుత్వ ప్రతిష్ట మరింత దిగజారి పోతుందని కూడా అన్నారు. అంతటితో ఆగకుండా దానం నాగేందర్ తన నియోజకవర్గంలో హైడ్రా కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం కూడా చేశారు. దానం నాగేందర్ మూసీ నది ప్రక్షాళన జరగాలంటూనే అదే సమయంలో పేదల ఇళ్లను కూల్చితే తాను ఒప్పుకోనని తెగేసి చెబుతున్నారు. దానం నాగేందర్ కు మంత్రి పదవి వస్తుందని భావించినా అది సాధ్యంకాలేదు. దీంతో నాగేందర్ ఫ్రస్టేషన్ కు లోనవుతున్నట్లు కనిపిస్తుంది. తేలని నిర్ణయం తాజా వ్యాఖ్యలతో... ఇక మరో అడుగు ముందుకు వేసి హైదరాబాద్ యూనివర్సిటీ భూముల వివాదంలో నోటీసులు అందుకున్న ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ కు కూడా అండగా నిలిచారు. స్మితా సబర్వాల్ రీట్వీట్ చేసిన విషయాల్లో తప్పేమీ లేదని అనడంతో దానం నాగేందర్ నేరుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగానే వ్యాఖ్యానించినట్లు స్పష్టమవుతుంది. స్మితా సబర్వాల్ కాంగ్రెస్ ను ఉద్దేశించి ఏమీ అనలేదని దానం నాగేందర్ వెనకేసుకొచ్చారు. మరొక వైపు ఈనెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభ విజయవంతమవుతుందని కూడా దానం నాగేందర్ అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ఈ సభకు భారీ సంఖ్యలో జనం హాజరవుతారన్న ఆయన కేసీఆర్ ను చూసేందుకు, ఆయన మాటలను వినేందుకు ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని అని కారులో కర్చీఫ్ వేసినట్లయింది.

## అమల్లోకి హెచ్ఎండీఏ బిల్డ్ నౌ సేవలు

**హైదరాబాద్, ఏప్రిల్ 26 పెన్ పవర్:** భవన నిర్మాణలు, లేఔట్ల అనుమతుల మంజూరు విషయంలో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త సంస్కరణలు తీసుకువచ్చింది. వేగంగా, సులభంగా అనుమతులు పొందేలా 'బిల్డ్ నౌ' అప్లికేషన్ సేవలను ప్రవేశపెట్టింది. మొదట్లో జీహెచ్ఎంసీ పరిధిలోనే ఈ సేవలు అందబాటులో ఉండగా%ౌ% తాజాగా హెచ్ఎండీఏ పరిధిలోనూ ఈ సేవలు ప్రారంభమయ్యాయి.టీజీ – బీపాస్ ద్వారా భవన నిర్మాణాలు, లేఔట్లకు అనుమతులు వచ్చేవి. అయితే ఇందులో ఇబ్బందులకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టడంతో పాటు అత్యంత వేగంగా అనుమతులు ఇచ్చేలా తెలంగాణ ప్రభుత్వం 'బిల్డ్ నౌ' వ్యవస్థను తీసుకువచ్చింది. తొలుత ఈ విధానాన్ని జీహెచ్ఎంసీ పరిధిలో అమలు చేయగా.. సత్ఫలితాలు వచ్చాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే ఈ అప్లికేషన్ ప్రత్యేకతలు, వివరాలెంటో ఇక్కడ తెలుసుకోండి%ౌ.

'బిల్డ్ నౌ' అప్లికేషన్ సేవలు – ముఖ్యమైన అంశాలు: రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం 'బిల్డ్ నౌ' అనే అప్లికేషన్ తీసుకువచ్చింది.ఈ అధునాతన అప్లికేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ముందుగా ఈ సేవలను జీహెచ్ఎంసీ పరిధిలో అమలు చేశారు. దీని ద్వారానే దరఖాస్తులను స్వీకరించి భవన నిర్మాణ అనుమతులను మంజూరు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చైన్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆటోమేషన్ వంటి సాంకేతికతను ఉపయోగిస్తారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా అత్యంత వేగంగా అనుమతులు మంజూరు చేయడమే 'బిల్డ్ నౌ' సేవల ముఖ్య ఉద్దేశ్యం.

ప్రస్తుతం %నవీణాూ% పరిధిలోనూ ఈ అప్లికేషన్ ద్వారానే అనుమతులు మంజూరు చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మన్సిపాలిటీల్లోనూ ఈ సేవలు అమలు చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఈ అప్లికేషన్ ద్వారా వేగంగా ప్రాసెస్ పూర్తవుతుంది. అనుమతి ప్రక్రియ అంతా ఒకే చోట పూర్తి చేయగల ఏకీకృత సింగిల్ విండో ఇంటర్ ఫేస్ అని అధికారులు చెబుతున్నారు.గతంలో భవన నిర్మాణ అనుమతులు వారం నుంచి నెలరోజుల్లో వచ్చేవి. అయితే ఈ అప్లికేషన్ ద్వారా అత్యంత వేగంగా%ౌ% నిమిషాల వ్యవధిలోనే ఔట్ పుట్ ఉంటుంది.

# దువ్వాడ కొంపముంచిన అడల్టరీ

**విజయనగరం, ఏప్రిల్ 26, పెన్ పవర్:**
ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ రాజకీయ జీవితం డోలాయమానంలో పడింది. ఆయన రాజకీయ జీవితానికి ఫుల్ స్టాప్ పడేలా ఉంది. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి దువ్వాడ శ్రీనివాస్ ను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. వ్యక్తిగత కారణాలతో తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఎమ్మెల్సీ దువ్వాడ చెబుతున్నారు. అయితే పార్టీ క్రమశిక్షణ అతిక్రమించినందుకే వేటు వేసినట్లు హైకమాండ్ ప్రకటించింది. అదే సమయంలో మంత్రి లోకేష్ ను పొగడడం వల్లే దువ్వాడ శ్రీనివాసును సస్పెండ్ చేశారని టిడిపి, జనసేన సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నాయి. ఇంకోవైపు వైసీపీ సోషల్ మీడియాలో మాత్రం దువ్వాడను ఏనాడో సస్పెండ్ చేయాల్సిందేనన్న పోస్టులు కనిపిస్తున్నాయి.అయితే రకరకాల విశ్లేషణలు ఉన్నాయి కానీ.. అసలు దువ్వాడను ఎందుకు సస్పెండ్ చేశారు అన్నది స్పష్టత లేకుండా పోతోంది. వాస్తవానికి దువ్వాడపై ఎప్పుడో సస్పెన్షన్ విధించాల్సి ఉన్న.. ఆయన వైఖరి మారుతుందేమోనన్న ఆలోచనతో ఇన్నాళ్లు హై కమాండ్ వేచి చూసినట్లు తెలుస్తోంది. రోజురోజుకు ఆయన పరిస్థితిపై విమర్శలు ఎక్కువ అవుతుండడంతో చివరికి వేటు వేశారని తెలుస్తోంది. భార్య పిల్లలతో తగాదా పెట్టుకున్నారు దువ్వాడ శ్రీనివాస్. ప్రేయసి మాధురితో కలిసి చట్టా పట్టాలు వేసుకుని తిరుగుతున్నారు. రోజురోజుకు వారు స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాలో రచ్చకెక్కుతున్నారు. మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు.

అది పార్టీకి చెడ్డ పేరుగా మారుతోంది. వాస్తవానికి కుటుంబ వివాదం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో టెక్కలి ఇన్చార్జి పోస్టు నుంచి దువ్వాడ శ్రీనివాసును తొలగించారు. అయితే అది పనిష్మెంట్ గా భావించలేదు దువ్వాడ. మళ్లీ ఎన్నికల నాటికి తనకే టికెట్ అన్న ధీమా ఆయనది. అందుకే కొంచెం విపరీతంగా ప్రవర్తించారు. అందుకే హై కమాండ్ తోక కత్తిరించినట్లు వైసిపి వర్గాలు చెబుతున్నాయి.మరోవైపు టెక్కలి నియోజకవర్గంలో సైతం దువ్వెల మాధురి తల దూర్చుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ ఇన్చార్జిగా పేరాడ తిలక్ ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో తిలక్కు శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేశారు. దువ్వాడ శ్రీనివాస్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేశారు. కానీ ఇద్దరూ ఓడిపోయారు. టెక్కలి ఇన్చార్జిగా దువ్వాడ శ్రీనివాసును తప్పించారు. పేరాడ తిలక్ కు ఆ బాధ్యతలు అప్పగించారు. కానీ ఇటీవల మాధురి సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. పుష్ప డైలాగును గుర్తుచేసేలా..' దమ్ముంటే తెచ్చుకోరా టిక్కెట్టు.. తెచ్చుకుంటే వదిలేస్తే పోస్టింగు' ఆల్టో పెట్టిన సోషల్ మీడియా పోస్ట్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో

చర్చకు దారితీసింది. దీనిపై టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ తిలక్ తో పాటు చాలామంది వైసీపీ నేతలు హై కమాండ్కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపైనే హై కమాండ్ సీరియస్ గా స్పందించి చర్యలు తీసుకున్నట్లు సమాచారం.మరోవైపు అడల్టరీ పేరుతో దువ్వాడ శ్రీనివాస్ జంట చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదు. సోషల్ మీడియాతో పాటు మీడియా ఛానళ్లకు వారు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. అయితే ఇవి మహిళల విషయంలో ఇబ్బందికరంగా ఉన్నాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా నేతలు జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. వారి ప్రవర్తనతో పార్టీకి చెడ్డ పేరు వస్తోందని.. ముఖ్యంగా మహిళలు యావగించుకుంటున్నారని.. చర్యలు తీసుకోకపోవడంతో హై కమాండ్ తీరును ఎక్కువమంది తప్పు పడుతున్నారని ఫిర్యాదు చేశారు. అందుకే అధినేత జగన్మోహన్ రెడ్డి చర్యలకు ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# భారత్ సమ్మిట్‌లో ఇండియా మ్యాప్‌ని అలా?

## రేవంత్ సర్కారు కొత్త తలనొప్పి



**హైదరాబాద్, ఏప్రిల్ 26,పెన్ పవర్:**జమ్మూ కాశ్మీర్‌లో పహల్గామ్‌లో జరిగిన మారణహోమంపై దేశమంతా రగిలిపోతున్న వేళ.. తెలంగాణ కాంగ్రెస్ మరో వివాదంలో చిక్కుకుంది. 'గ్లోబల్ జస్టిస్ అందించడమే ప్రధాన లక్ష్యం' అనే ఇతివృత్తంతో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా ఏప్రిల్ 25 నుంచి ఏప్రిల్ 26 వరకు "భారత్ సమ్మిట్ 2025" నిర్వహిస్తుండగా.. సుమారు 100 దేశాల నుంచి 450 మంది విదేశీ ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమ్మిట్?లో.. ఏర్పాటు చేసిన భారతదేశ చిత్ర పటం తప్పుగా ఉండటం ఇప్పుడు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. భారత సమ్మిట్‌లో పాల్గొన్న ఫొటోలను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేయగా.. ఈ వివాదం చెలరేగింది. రాజగోపాల్ రెడ్డి ఫొటోల్లో దూరంగా ఓ ఇండియా చిత్రం కనిపిస్తుండగా.. అందులో జమ్మూ కాశ్మీర్‌ను పూర్తిగా ముద్రించనట్టుగా కనిపిస్తోంది. దీంతో.. ఒక్కసారిగా వివాదం చెలరేగింది. బీజేపీ నేతలే కాకుండా చాలా మంది నెటిజన్లు.. ఈ విషయంపై తీవ్ర స్థాయిలో విమర్శలతో విరుచుకుపడ్డారు. ఈ పరిణామంతో కాసేపటికే ఆ పోస్ట్‌ని రాజగోపాల్ రెడ్డి డిలీట్ చేశారు.అయినప్పటికీ.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోస్ట్ చేసిన ఫొటోలను స్క్రీన్ షాట్ తీసిన.. బీజేపీ నేతలు, కార్యకర్తలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ రచ్చ చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీ దేశద్రోహి, ప్రజావ్యతిరేక స్వభావాన్ని బహిర్గతం చేసే ఓ క్లాసిక్ ఉదాహరణ అని బీజేపీ నేతలు ఆరోపిస్తూ.. పోస్టులు పెడుతున్నారు. ఈ మేరకు బీజేపీ తెలంగాణ అఫీషియల్ ఖాతాలో స్క్రీన్ షాట్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యాఖ్యలు పోస్టు చేశారు. తెలంగాణ ప్రజల పన్నుల నుంచి వచ్చిన ప్రభుత్వ నిధులను వినియోగిస్తూ.. కేవలం కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రమే ఆహ్వానితులుగా సమ్మిట్‌ను నిర్వహించారని ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ నిర్లక్ష్యం మాత్రమే కాదు, ఇది దేశ ద్రోహం అని బీజేపీ తెలంగాణ అభివర్ణించారు.కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మ్యాప్‌లో లద్దాఖ్, పాక్ ఆక్రమిత కశ్మీర్ ను ఉద్దేశపూర్వకంగా తొలగించారని బీజేపీ తెలంగాణ మండిపడింది. ఇది ప్రపంచానికి చాలా ప్రమాదకరమైన, నీచమైన సందేశాన్ని పంపుతోందని నిప్పులు చెరిగింది. అంటే ఇవి ఇకపై భారత్‌లో భాగం కావని వారి ఉద్దేశమంటూ విమర్శించింది. ప్రజల పన్ను డబ్బులతో నిర్వహించిన ఈ కార్యక్రమం మన జవాన్ల త్యాగాలను అవమానించడం మాత్రమే కాకుండా, భారత దేశ సార్వభౌమాధికారాన్ని నేరుగా దెబ్బతీయడంగా బీజేపీ తెలంగాణ తీవ్ర స్థాయిలో దుయ్యబట్టింది. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అన్ని రెడ్ లైన్స్ దాటి పోయిందని.. ఇది దేశద్రోహ చర్య అని స్పష్టంగా కనిపిస్తోందని బీజేపీ తెలంగాణ దుయ్యబట్టింది.కాంగ్రెస్ పార్టీ ఇలాంటి వివాదాల్లో చిక్కుకోవడం ఇది మొదటిసారి కాదు. గత ఏడాది డిసెంబర్‌లో కర్ణాటకలోని బెళగావిలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల్లోనూ ఇదే తరహా వివాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో భారత దేశ పటాన్ని కశ్మీర్, లేహ్ లేకుండా ముద్రించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. బీజేపీ నాయకులు అప్పట్లో కాంగ్రెస్ పార్టీ కావాలనే దేశానికి వెన్నుపోటు పొడుస్తోందని తీవ్రంగా దుయ్యబట్టారు. ఇప్పుడు తాజాగా చోటుచేసుకున్న ఈ ఘటన కూడా అదే తరహా దేశద్రోహ చర్య అని బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ వెంటనే స్పందించి వివరణ ఇవ్వాలని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో రాజకీయంగా ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి.

# టార్గెట్ స్లీపర్ సెల్స్

**హైదరాబాద్, ఏప్రిల్ 26, పెన్ పవర్:**
2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు. పుల్వామా 2019 తర్వాత జరిగిన అత్యంత దారుణమైన దాడుల్లో ఇది ఒకటి. ఈ దాడి తర్వాత, కర్ణాటక సర్కార్ అప్రమత్తమైంది. ముఖ్యంగా బెంగళూరులో భద్రతను పటిష్టం చేసుకునేందుకు వేగంగా చర్యలు చేపట్టింది.పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్ పౌరులకు అన్ని వీసాలు రద్దు చేసింది కేంద్రం. పాక్ పౌరులు దేశం విడిచి వెళ్లాలని ఆదేశాలు జారీచేశారు. మెడికల్ వీసాలకు మాత్రం ఏప్రిల్ 29 వరకు అనుమతి ఇచ్చారు. భారత పౌరులు పాకిస్తాన్ వెళ్లరాదని కేంద్రం సూచించింది. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి, పాకిస్థానీయులను వెంటనే పంపించాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే పాకిస్తాన్ నుండి అక్రమ వలసదారులను, స్లీపర్ సెల్స్‌ను వెతికే పనిలో పడ్డారు కర్ణాటక పోలీసులు.సార్క్ వీసా మినహాయింపు పథకం కింద పాకిస్తానీ జాతీయులు భారతదేశంలోకి ప్రవేశించకుండా నిషేధించాలన్న కేంద్రం ఆదేశాలను అనుసరించి, చెల్లుబాటు అయ్యే పత్రాలు లేని వారిని గుర్తించి బహిష్కరించడంలో కర్ణాటక ప్రభుత్వం అన్ని విధాలుగా జాగ్రత్త తీసుకుంటుందని కర్ణాటక హోం మంత్రి జి. పరమేశ్వర స్పష్టం చేశారు. అక్రమ నివాసితులపై ఉచ్చు బిగించడంతోపాటు.. సరైన డాక్యుమెంటేషన్ లేని పాకిస్తాన్ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని పరమేశ్వర తెలిపారు. "కేంద్ర నిఘా సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, కర్ణాటకలో, ముఖ్యంగా బెంగళూరులో చట్టవిరుద్ధంగా నివసిస్తున్న పాకిస్తానీ జాతీయులను గుర్తించి, అదుపులోకి తీసుకుని, బహిష్కరణ కోసం వారిని హైకమిషన్‌కు అప్పగిస్తామని ఆయన అన్నారు.కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడానికి, కర్ణాటక రాష్ట్ర పోలీసులు లాడ్జీలు, అతిథి గృహాలు, ఇతర స్థావరాల్లో ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. స్లీపర్–సెల్ కార్యకలాపాల గురించి ఏదైనా సమాచారం అందిన వెంటనే చర్య తీసుకోవడానికి నగరవ్యాప్తంగా స్థానిక పోలీసు స్టేషన్లలో %జదీ×, ×దీ% అధికారులను మోహరించారు.బెంగళూరులో పాకిస్తానీయులు ఉన్నారంటూ ఇటీవలి శాసనసభ సమావేశంలో పరమేశ్వర తెలిపారు. కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 137 మంది అక్రమ వలసదారులను గుర్తించి అరెస్టు చేసిందని, వారిలో 25 మంది పాకిస్తానీ జాతీయులు అని వెల్లడించారు. ఇందులో 84మందిని బెంగళూరు నగరంలోనే అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పాకిస్తాన్ నుండి వచ్చి సరియైన పత్రాలు లేని నివాసితులకు బెంగళూరు మహానగరం ప్రాథమిక కేంద్రంగా మారిందన్నారు.2024 చివరలో, ఇంటెలిజెన్స్ బ్యూరో సూచన ప్రకారం బెంగళూరు శివార్లలోని జిగాని పారిశ్రామిక బెల్ట్‌లో అధికారులు సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో నకిలీ పత్రాలతో చట్టవిరుద్ధంగా నివసిస్తున్న ఒక పాకిస్తానీ జాతీయుడు, మరో ముగ్గురు అనుమానితులను అరెస్టు చేశారు. వారికి నకిలీ పాస్‌పోర్ట్‌లు, గుర్తింపు తారుమారుకి దోహదపడే పెద్ద రహస్య నెట్‌వర్క్‌తో సంబంధాలున్నాయని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఇటువంటి స్లీపర్ సెల్స్ నెలలు, సంవత్సరాలు సైలెంట్‌గా ఉంటారని, పెద్ద టాస్క్‌లో భాగం అయ్యేవరకు నగరంలోని సాధారణ జనంతో కలిసిపోతారని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నారు. స్లీపర్ సెల్స్‌పై ఫుల్ ఫోకస్ పెట్టిన బెంగళూరు పోలీసులు.. ఎలాంటి కమ్యూనల్ హింసకు తావు లేకుండా%ౌ%. వారి అంతు తేల్చగలరా అన్నది మున్ముందు తేలనుంది.

# కరోనా నుంచి కోలుకోని మెట్రో...

**హైదరాబాద్, ఏప్రిల్ 26,పెన్ పవర్:**
హైదరాబాద్ నగర ప్రజల నుంచి విశేషమైన ఆదరణ పొందినప్పటికీ.. మెట్రో రైల్ ఆర్థికంగా కుదేలవ్వడానికి అనేక కారణాలు ఉన్నాయి. 2020–21 మధ్య ప్రపంచాన్ని వణికించిన కోవిడ్–19 మహమ్మారి సమయంలో విధించిన లాక్‌డౌన్ కారణంగా దాదాపు ఒక సంవత్సరం పాటు మెట్రో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ సమయంలో ప్రయాణికుల రాకపోకలు పూర్తిగా స్తంభించడంతో ఆదాయం భారీగా పడిపోయింది.మరోవైపు.. మెట్రో ప్రాజెక్ట్ కోసం తీసుకున్న భారీ రుణాల చెల్లింపుల భారం సంస్థపై తీవ్రంగా ఉంది. వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలకు అధిక వడ్డీలు చెల్లించాల్సి

రావడంతో ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ప్రయాణికుల సంఖ్య కోవిడ్ ముందు స్థాయికి చేరుకోవడానికి దాదాపు రెండేళ్లు పట్టడం కూడా నష్టాలకు ఒక ప్రధాన కారణం. ఈ అంశాలన్నీ కలిసి మెట్రోకు రూ. 4,828.55 కోట్ల నష్టం వాటిల్లిందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. గతేడాది మెట్రో తన కొన్ని ఆస్తులను తాకట్టు పెట్టడం ద్వారా కొంతమేరకు ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నించింది.టికెట్ల విక్రయం.. ప్రకటనల ద్వారా మెట్రో సుమారు రూ.1400 కోట్ల ఆదాయం పొందినప్పటికీ.. చెల్లించాల్సిన అధిక వడ్డీలు ఈ ఆదాయాన్ని మించిపోతున్నాయి. దీంతో మెట్రో నిరంతరం భారీ నష్టాల్లో కూరుకుపోతోంది. భవిష్యత్తులో

ఈ ఆర్థిక సంక్షోభం నుంచి హైదరాబాద్ మెట్రో ఎలా బయటపడుతుందో చూడాల్సి ఉంది. ప్రభుత్వం లేదా ఎల్ అండ్ టీ సంస్థ నుంచి ఎలాంటి సహాయం అందుతుందో వేచి చూడాలి. ఈ నేపథ్యంలోనే.. మెట్రో టికెట్ ధరలు పెంచనున్నారన్న వార్తలు వైరల్ అవుతుండగా.. అలా అయినా నష్టాలను కొంతమేర పూడ్చొచ్చన్న ఆలోచన చేస్తున్నట్టుగా సమాచారం.

# సండేనే డబుల్ ధమాకా: ఇకపై శనివారం ఒకటే ఐపీఎల్ మ్యాచ్.. కారణం ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో వీకెండ్ వచ్చిందంటే క్రికెట్ ఫ్యాన్స్ కు డబుల్ ధమాకా ఖాయం. శనివారం, ఆదివారం రెండు మ్యాచ్ లు జరగడమే ఇందుకు కారణం. రెండు రోజులు మొత్తం నాలుగు మ్యాచ్ లు అభిమానులకు మంచి కిక్ ఇస్తాయి. ఈ రెండు రోజులు డబుల్ హెడ్డర్ ఉండడంతో అభిమానులు తెగ ఎంజాయ్ చేస్తారు. అయితే క్రికెట్ అభిమానులకు ఇక నుంచి చిన్న షాక్. ప్రస్తుత సీజన్ లో ఇకపై శనివారం ఒకటే మ్యాచ్ జరగనుంది. గత మూడు వారాలుగా రెండు మ్యాచ్ లు చూస్తూ ఎంజాయ్ చేసిన ఫ్యాన్స్ కు ఇది ఒకరకంగా బ్యాడ్ న్యూస్ అనే చెప్పాలి. ఆటగాళ్లు అలసిపోకుండా ఉండాలని.. టోర్నీ చివరి దశలో అన్ని జట్లకు రెస్ట్ అవసరమని భావిస్తూ ఐపీఎల్ ఈ నిర్ణయం తీసుకుంది. ఆదివారం మాత్రమే ఎప్పటిలాగే రెండు మ్యాచ్ లు జరుగుతాయి. ఈ సీజన్ లో ఒక ఆదివారం మాత్రమే ఒక మ్యాచ్ నిర్వహించాల్సి వచ్చింది. అయితే దీనికి కారణం లేకపోలేదు. (ఏప్రిల్ 6) మధ్యాహ్నం కోల్?కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జయింట్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ శ్రీరామ నవమి పండుగ కారణంగా పోస్ట్ పోన్ చేయాల్సి వచ్చింది. కోల్?కతాలో శ్రీరామ నవమి వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించే అవకాశం ఉండటంతో.. అటు ఊరేగింపు వేడుకలకు.. ఇటు మ్యాచుకు బందోబస్తు ఇవ్వడం కష్టమని కోల్?కతా పోలీసులు ఐపీఎల్ మ్యాచుకు అనుమతి నిరాకరించారు. నేడు ఐపీఎల్ లో శనివారం (ఏప్రిల్ 26) కోల్ కతా నైట్ రైడర్స్ తో పంజాబ్ కింగ్స్ తలపడుతుంది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కు కేకేఆర్ కు అత్యంత కీలకంగా మారింది. మరోవైపు పంజాబ్ ఈ మ్యాచ్ లో గెలిచి ప్లే ఆఫ్స్ రేస్ లో ముందుకెళ్లాలని భావిస్తుంది. రేపు ఆదివారం (ఏప్రిల్ 27) యధా విధిగా రెండు మ్యాచ్ లు జరుగుతాయి. మధ్యాహ్నం మ్యాచ్ లో లక్నో సూపర్ జయింట్స్ తో ముంబై ఇండియన్స్.. సాయంత్రం రాయల్ ఛాలెంజర్స్ తో ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తలపడతాయి.

# టీమిండియాతో పాటు సౌతాఫ్రికా, శ్రీలంక.. ట్రై సిరీస్ లైవ్ స్ట్రీమింగ్, షెడ్యూల్ వివరాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మహిళా క్రికెటర్లు వరల్డ్ కప్ కు ముందు కొత్త సవాలుకు సిద్ధం కానున్నారు. శ్రీలంక గడ్డపై ట్రై సిరీస్ ఆడేందుకు రెడీ అయిపోయారు. భారత్, శ్రీలంక, సౌతాఫ్రికా ఈ ముక్కోణపు సిరీస్ ఆడనున్నాయి. ఆదివారం (ఏప్రిల్ 27) ఈ మెగా సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ లో భాగంగా మొత్తం 7 మ్యాచ్ లు జరుగుతాయి. అన్ని మ్యాచ్ లకు కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియం ఆతిథ్యం ఇస్తుంది. మే 11 న జరగబోయే ఫైనల్ తో ఈ టోర్నీ ముగుస్తుంది. ఫైనల్‌కు ముందు అన్ని జట్లు నాలుగు మ్యాచ్ లు ఆడతాయి. రౌండ్ రాబిన్ లీగ్ లో భాగంగా ఒక్కో జట్టు మిగిలిన జట్లతో రెండేసి మ్యాచ్ లు ఆడాల్సి ఉంటుంది. వన్డే ఫార్మాట్ లో జరగబోయే ఈ టోర్నీలో తొలి మ్యాచ్ లో శ్రీలంకతో ఇండియా ఆదివారం (ఏప్రిల్ 27) తలబడుతుంది. జట్టు విషయానికి వస్తే లెఫ్ట్ హ్యాండర్ స్పిన్నర్లు శుచి ఉపాధ్యాయ్, శ్రీ చరణిలకు అవకాశం దక్కింది. ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ కశ్వి గౌతమ్ తొలి సారి తొలిసారి జట్టులో స్థానం దక్కించుకుంది. యస్తిక భాటియా, స్నేహ్ రాణా కూడా తిరిగి జట్టులోకి వచ్చారు. శ్రీలంక జట్టుకు అనుభవజ్ఞురాలైన ఆల్ రౌండర్ చమరి అథపత్తు నాయకత్వం వహిస్తారు. సౌతాఫ్రికా జట్టుకు లారా వోల్వార్ట్ కెప్టెన్ గా చేస్తుంది.

శ్రీలంక మహిళల ట్రై-సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం ఉదయం 10 గంటలకు జరుగుతాయి.

**మహిళల ట్రై-సిరీస్‌ను ఎక్కడ చూడాలంటే..?**

శ్రీలంక మహిళల ట్రై-సిరీస్‌లోని మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం ఫ్యాన్‌కోడ్ యాప్‌లో అందుబాటులో ఉంటుంది.

**ఇండియా, శ్రీలంక, సౌతాఫ్రికా స్క్వాడ్స్:**

**భారత జట్టు:**

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, యాస్తికా భాటియా, దీప్తి శర్మ, అమంజోత్ కౌర్, కష్వీ గౌతమ్, స్నేహ రాణా, అరుంధతి రెడ్డి, తేజల్, శ్రీ హసబ్నీలు

**దక్షిణాఫ్రికా జట్టు:**

లారా వోల్వార్ట్ (కెప్టెన్), తజ్మిన్ బ్రిట్స్, నాడిన్ డి క్లెర్క్, అన్నరీ డెర్క్‌సెన్, లారా గూడాల్, సినాలో జాఫ్తా, అయాబొంగా ఖాకా, మసబాటా క్లాస్, సన్ లూస్, కరాబో మెసో, నోంకులులేకో మ్లాబా, షేష్నీ, ఎమ్ షన్గాన్, నోన్‌స్, ఎం షన్గాన్

**శ్రీలంక జట్టు:**

చమరి అతపత్తు (కెప్టెన్), విష్మి గుణరత్నే, హర్షిత సమరవిక్రమ, నీలాక్షి సిల్వా, కవిషా దిల్హరి, అనుష్క సంజీవని, హాసిని పెరీరా, పియుమి వత్సలా, మనుడి నానయక్కర, దేవ్మీ విహంగ, ఇనోకా రణవీర, ఇనోకా రణవీర, ఇనోకా రనవీర సెవ్వండి, మల్కి మదార, సుగండిక కుమారి, అచ్చిని కులసూర్య

**ట్రై-సిరీస్ షెడ్యూల్**

మొదటి వన్డే: శ్రీలంక , భారత్, ఆదివారం, ఏప్రిల్ 27
రెండో వన్డే : భారతదేశం,. దక్షిణాఫ్రికా, మంగళవారం, ఏప్రిల్ 29
మూడో వన్డే: శ్రీలంక , దక్షిణాఫ్రికా, శుక్రవారం, మే 02
నాలుగో వన్డే: శ్రీలంక , భారత్, ఆదివారం, మే 04
ఐదో వన్డే: దక్షిణాఫ్రికా , భారత్, బుధవారం, మే 07
ఆరో వన్డే: శ్రీలంక , దక్షిణాఫ్రికా, శుక్రవారం, మే 09
ఫైనల్: ఆదివారం, మే 11

# ఐసీసీ ఈవెంట్స్ కూడా వద్దు.. పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలపై బీసీసీఐకి గంగూలీ విజ్ఞప్తి



**హైదరాబాద్ పెన్ పవర్:** మంగళవారం (ఏప్రిల్ 22) పహల్గామ్ ఉగ్రవాద దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పాకిస్తాన్‌తో ఎలాంటి సంబంధాలను అయినా వదులుకోవాలని భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ తెలిపారు. ప్రతి సంవత్సరం భారత గడ్డపై ఏదో ఒక ఉగ్రవాద కార్యకలాపాలు జరుగుతాయని.. ఇకపై ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించలేమని టీమిండియా మాజీ కెప్టెన్ అన్నారు. పాకిస్తాన్‌తో ఇండియా తన క్రికెట్ సంబంధాలన్నింటినీ తెంచుకోవాలని.. ఈ క్రమంలో ఐసీసీ, ఆసియా టోర్నమెంట్లలో కూడా పాక్ జట్టుతో మ్యాచ్ లు ఆడకూడదనే తన అభిప్రాయాన్ని బలంగా చెప్పుకొచ్చారు. గంగూలీ మాట్లాడుతూ “100 శాతం పాకిస్థాన్ తో ఇండియా అన్ని రకాల సంబంధాలను తెంచుకోవాలి. ఉగ్రవాదంపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. ప్రతి సంవత్సరం ఇలాంటివి జరుగుతుండటంతో ఈ విషయాన్ని తమాషాగా తీసుకోకూడదు. ఉగ్రవాదాన్ని సహించేది లేదు”. అని సౌరవ్ గంగూలీ విలేకరులతో అన్నారు. పహల్గాంలో ఉగ్రవాదుల నరమేధం తర్వాత.. బీసీసీఐ పాకిస్తాన్ తో ఇక నుంచి క్రికెట్ మ్యాచులు ఆడేది లేదని స్పష్టం చేసింది. తటస్థ వేదికలపైన కూడా పాక్ తో మ్యాచ్ లు ఆడేది లేదని.. ఖరాఖండీగా తేల్చి చెప్పింది. ఐసీసీ నిర్వహించే సిరీస్ ల విషయంలో ఆడాలా వద్దా అనేది.. భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా ఉంటుందని.. ప్రభుత్వం అనుమతి ఇస్తే అప్పుడు ఆలోచిస్తామని అంటోంది బీసీసీఐ. ఐసీసీ ఈవెంట్స్ లోనూ పాకిస్థాన్, ఇండియాను ఒకే గ్రూప్ లో ఉండకుండా చూడాలని ఐసీసీని బీసీసీఐ కోరింది. ఇండియా, పాక్ క్రికెట్ ఫీల్డ్‌లో తలపడితే చూడాలని ప్రపంచమంతా కోరుకుంటుంది. కానీ ఈ రెండు జట్ల మధ్య ఇకపై క్రికెట్ చూడడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తుంది. చివరిసారిగా 2012లో పాకిస్థాన్ భారత్ లో పర్యటించింది. 2008 లో భారత్ చివరిసారిగా పాకిస్థాన్ లో పర్యటిచింది. 2012 తర్వాత ఇరు జట్లు ఐసీసీ ట్రోఫీలో మాత్రమే తలబడుతున్నాయి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ పాకిస్థాన్ లో జరగనుంది. ఈ పర్యటనకు పాక్ గడ్డపై భారత్ అడుగుపెట్టే అవకాశాలు కనిపించడం లేదు.



'ఎగ్జిబిట్' కోసం మెస్మరైజింగ్ మృనాల్ యొక్క మాయా లుక్స్!

# యానిమల్ బ్యూటీ అప్పుడే బోర్ కొట్టేసిందా..?

ఏడెనిమిది ఏళ్ల క్రితం మామ్, పోస్టర్ బోయ్స్ సినిమాలతో తెరంగేట్రం చేసింది బాలీవుడ్ భామ త్రిప్తి డిమ్రి. కెరీర్ లో తనకు వచ్చిన అవకాశాలు చేస్తూ వచ్చింది. ఐతే ఎప్పుడైతే యానిమల్ సినిమా వచ్చిందో ఆ సినిమాతో అమ్మడి ఫేట్ మారిపోయింది. అంతకుముందు త్రిప్తిని గుర్తు పట్టని వారు కూడా త్రిప్తి కనిపిస్తే చాలు ఫోటోల కోసం ఎగబడుతున్నారు. యానిమల్ సినిమా ఇచ్చిన ఐడెంటిటీ అంతా ఇంతా కాదు అంటూ త్రిప్తి చాలా ఇంటర్వ్యూస్ లో చెప్పుకొచ్చింది. యానిమల్ క్రేజ్ తో త్రిప్తికి బాలీవుడ్ లో మరికొన్ని ఛాన్స్ లు వచ్చాయి. ఈ రెడేళ్లలో అమ్మడు హిందీలో నాలుగైదు సినిమాలు చేసింది. యానిమల్ సినిమాలో జోయా పాత్రలో త్రిప్తి ఆడియన్స్ ని మంత్రి ముగ్దుల్ని చేసింది. ఆ క్రేజ్ తో కొన్నేళ్ల పాటు బాలీవుడ్ లో తన హవా కొనసాగిస్తుందని అనుకున్నారు కానీ మూడు నాలుగు సినిమాలకే అమ్మడి పని అయిపోయింది. లాస్ట్ ఇయర్ త్రిప్తి బ్యాడ్ న్యూజ్, విక్కీ విద్యా కా ఓ వాలా వీడియో, భూమ్ భూలియా 3 సినిమాల్లో నటించింది. ఈ సినిమాల్లో కూడా త్రిప్తి గ్లామర్ ట్రీట్ తో అదరగొట్టింది. కానీ యానిమల్ లో వచ్చిన క్రేజ్ మాత్రం రాబట్టలేకపోయింది. ప్రస్తుతం అమ్మడు దఢక్ 2 తో పాటు మరో సినిమా చేస్తుంది. ఈ సినిమాల మీదే తన హోప్స్ అన్నీ పెట్టుకుంది త్రిప్తి డిమ్రి.యానిమల్ టైం లో సౌత్ నుంచి ముఖ్యంగా టాలీవుడ్ నుంచి త్రిప్తికి ఆఫర్లు రావడం ఖాయమని అనుకున్నారు. ఒకటి రెండు సినిమాల్లో హీరోయిన్ గా డిస్కషన్స్ కూడా జరిగాయని టాక్. ఐతే త్రిప్తి తెలుగు ఎంట్రీ ఇవ్వకముందే మళ్లీ కెరీర్ డౌన్ ఫాల్ అవుతుంది. లాస్ట్ ఇయర్ 3 సినిమాల్లో నటించినా అమ్మడు ఎలాంటి ప్రభావం చూపించకపోయే సరికి త్రిప్తి అప్పుడే బోర్ కొట్టేసిందా అని అనుకుంటున్నారు. ఏది ఏమైనా అందాల భామకి మళ్లీ యానిమల్ లాంటి సినిమా పడితే మాత్రం తిరిగి ఫాంలోకి వచ్చే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. త్రిప్తి టాలీవుడ్ ఎంట్రీ ఇస్తే మాత్రం అమ్మడికి ఇక్కడ మంచి పాపులారిటీ వచ్చే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. ఆమధ్య విజయ్ దేవరకొండ సినిమాలో త్రిప్తి నటిస్తుందని మీడియాలో వార్తలు వచ్చాయి కానీ వాటిలో వాస్తవం లేదని తెలుస్తుంది.





గ్రీన్ సీక్విన్స్‌లో అనన్య పాండే స్టన్స్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com